నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

మంగళవారం | డిసెంబర్ 31, 2024 | www.navatelangana.com

యూనివర్సిటీ హాస్టల్లో సమస్యలను పరిష్కరిస్తాం

- వైస్ ఛాన్సలర్ యాదగిరి రావు

నవతెలంగాణ-డిచ్‌పల్లి



తెలంగాణ యూనివర్సిటీలోని న్యూ, ఓల్డ్ బాయ్స్ హాస్టళ్లను వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి యాదగిరిరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం యాదగిరితో కలిసి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ మెస్ కమిటీతో పాటుగా విద్యార్థులను హాస్టల్లో ఉన్నటువంటి మౌలిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 24/7 వైఫై ని తక్షణమే అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. పాక్షికంగా మిగిలిన కార్పెంటర్, ప్లంబర్, ఎలక్ట్రికల్ పనులను అతి త్వరలో పూర్తి చేయిస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చారు. విద్యార్థుల వినతి మేరకు హాస్టల్ రెన్యువల్ డిపాజిట్ లను 3000 నుండి 2000 తగ్గిస్తామని విద్యార్థులకు సూచించారు. ఈ ఆకస్మిక తనిఖీలో ఇంజనీర్ వినోద్, చీఫ్ వార్డెన్ డాక్టర్ మహేందర్ రెడ్డి , వార్డెన్లు ,కేర్ టేకర్లు తదితరులు పాల్గొన్నారు.

అధికారం కోల్పోయాక బీసీల జపం చేస్తున్న కవిత

- ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు కేఏ పాల్

నవతెలంగాణ-కంఠేశ్వర్



తెలంగాణ రాష్ట్రంలో బీసీ వర్గాలు కవిత ఉచ్చులో పడొద్దని, పదేళ్ల అధికారంలో ఉన్నా బీఆర్ఎస్ పార్టీ ఏనాడు వారి సంక్షేమం పట్టించుకోలేదని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు కేఏ పాల్ ఆరోపించారు. నిజామాబాద్ నగరంలోని ఓ హెూటల్లో ఆయన సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. అధికారం కోల్పోయిన తర్వాత కేవలం స్వప్రయోజనాల కోసమే కల్వకుంట్ల కవిత బీసీల జపం చేస్తుందని ఆక్షేపించారు. బీసీలు ఇప్పటికైనా రాజకీయ చైతన్యం తెచ్చుకొని కవిత ఉచ్చులో పడవద్దని ఆయన సూచించారు.

వివరాలు మెయిన్‌లో..

ఒడిదుడుకుల సాగు

- వాతావరణం సహకరించినా.. ఆశించిన దిగుబడి రాలే
- తేమ, ధరలు, కడ్తా దోపిడీలు షరామామూలే
- రైతుభరోసా రాక.. రుణమాఫీ పూర్తికాక అసంతృప్తి
- కొనుగోలు ఆలస్యం చేయడంతో తీవ్ర నష్టం
- అధిక మంది రైతులకు మద్దతు ధర లభించని వైనం
- సన్నబియ్యానికి బోనస్‌తో.. రైతుల్లో ఉత్సాహం

నవతెలంగాణ-నిజామాబాద్‌డెస్క్







ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది వ్యవసాయం అన్నదాతలకు ఒడిదుడుకుల మధ్యే సాగింది. వర్షాకాలం సీజన్‌లో సకాలంలో వర్షాలు కురవకపోవడంతో ఆందోళన వ్యక్తం కాగా.. తరువాత కురిసిన భారీ వర్షాలతో ప్రాజెక్టులు, చెరువులు కుంటలకు చెలకళ సంతరించుకుంది. వాతావరణం సహకరించినా.. వివిధ కారణాలతో ఆశించిన పంట దిగుబడి రాకపోవడం.. పండించిన పంటలను సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో చాలా మంది రైతులు నష్టపోయారు. మరోపక్క ఈ ఏడాది ప్రభుత్వం నుంచి రైతుభరోసా కింద పెట్టుబడి సాయం కూడా దక్కలేదు. కేవలం రూ.2లక్షల లోపు రుణమాఫీ అయిన రైతుల్లో ఆనందం వ్యక్తమవుతుండగా.. రూ.2 లక్షలకు పైగా ఉన్న రైతులకు మాఫీ జరగకపోవడంతో తీవ్ర నిరాశలో ఉన్నారు. ఈ ఏడాది పంటల బీమా సైతం అమలు కాలేదు. మరోపక్క తేమ పేరిట ధరలో భారీగా కోత విధించడం, ప్రయివేటు వ్యాపారులు కనీసం మద్దతు ధర కూడా చెల్లించకపోవడంతో రైతులు అసంతృప్తికి లోనవుతున్నారు. కాగా ఈసారి సన్నవడ్లకు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించడంతో రైతులకు కొంత వరకు మేలు జరిగినట్టయింది. అయితే బోనస్ వస్తదో రాదో అనే అనుమానంతో ఎక్కువ మంది రైతులు తమ సన్నవడ్లను ప్రయివేటు వ్యాపారులకే విక్రయించుకున్నారు.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రధానంగా వరి పంట సాగుచేస్తుంటారు. ఇటు ఎస్సారెస్పీ, అటు నిజాంసాగర్ ప్రాజెక్టులు ఇరు జిల్లాలకు ప్రధాన నీటి వనరులను తీరుస్తున్నాయి. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా సుమారు 5 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతుండగా.. అందులో ప్రధానంగా వరి సుమారు 3.50 లక్షల ఎకరాల వరకు సాగవుతుంది. ఇక కామారెడ్డి జిల్లా వాప్తంగా 3.90 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతుండగా.. అందులో వరి 2.40 లక్షల వరకు సాగవుతుంది. వరితో పాటు శనగ, మక్కజొన్న, పొద్దుతిరుగుడు, సోయా, పత్తి పంటను విరివిగా పండిస్తారు.

ఖరీఫ్ ప్రారంభంలో బీటీ విత్తనాల కోసం కొన్ని రోజుల పాటు ఆందోళన నెలకొనగా.. ఉన్నతాధికారుల చొరవ కారణంగా ఈ సమస్య త్వరగానే పరిష్కారమైంది. కాగా వర్షాకాలం సీజన్ ప్రారంభంలో ఆశించిన వర్షాలు కురవకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. ఈసారి నష్టాలు వచ్చే అవకాశం ఉందని భావించారు. కాగా సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలతో అటు పంటలకు, ఇటు ప్రాజెక్టులకు, చెరువులకు, కుంటలకు జలకళ సంతరించుకుంది.

ఉమ్మడి జిల్లాలో వరి మీదనే ఆధార పడి రైతులు జీవనం సాగిస్తుంటారు. ఇదే ప్రధాన పంట కావడంతో కొనుగోలు, లారీల కొరతపై అందరి దృష్టి నెలకొంది. వరి పంటకు క్వింటాకు రూ.2320 ధర కేటాయించారు. కాగా పంట చేతికొచ్చినా కొనుగోలు కేంద్రాల ప్రారంభంలో ఆలస్యం జరగడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. రైస్‌మిల్లర్ల తీరుపై గుర్రుగా ఉన్న ప్రభుత్వం.. వారికి ఖచ్చితమైన నిబంధనలు పెట్టి వాటిని అమలు చేసిన వారికే ధాన్యం కేటాయించారు. ఈ క్రమంలో కొనుగోలు ఆలస్యం కావడంతో పలువురు రైతులు తమ పంటను ప్రయివేటు వ్యాపారులకు విక్రయించుకోవాల్సి వచ్చింది. మరోపక్క సోయా పంటను సైతం పూర్తిగా కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రైతుభరోసా రాక నిరాశ..!

ప్రభుత్వం ప్రతి ఏటా రైతులకు పెట్టుబడి సాయం రైతుబంధు ఇస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ పథకాన్ని రైతుభరోసాగా మార్చింది. ఎకరానికి రూ.7500చొప్పున ప్రతి రెండు సీజన్లకు ప్రతి ఏటా రూ.15వేలు అందజేస్తామని హామీనిచ్చింది. ప్రభుత్వం ఈ పథకం విధివిధానాలపై రైతుల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ సైతం చేపట్టింది. కానీ ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మాత్రం రైతులకు ఈ పథకం కింద పెట్టుబి సాయం అందించకపోవడంతో అన్నదాతలు తీవ్ర నిరాశ చెందుతున్నారు. రబీ సీజన్‌కు సైతం ఇప్పటికే ఖాతాల్లో జమ కావాల్సి ఉండగా.. ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. రానున్న సంక్రాంతి నాటికి అందజేస్తామని చెబుతోంది.

మరోపక్క జిల్లాలో రుణమాఫీలో చిన్నచిన్న కారణాలు, అధికారుల తప్పిదాలతో చాలా మంది రైతులకు రుణమాఫీ కాలేదు. రుణమాఫీ కాని వారి వివరాలు సేకరించి మరోసారి వేసినా.. చిన్నచిన్న తప్పిదాల వల్ల చాలా మంది రుణమాఫీకి దూరమైయ్యారు. వారంతా ప్రభుత్వం తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఈ సమస్యను గుర్తించినా ఇంకా పరిష్కరించడం లేదు. మరోపక్క అధికారంలోకి రాగానే పంటల బీమాను అమలు చేస్తామని ప్రభుత్వం హామీనిచ్చినా.. ఈ ఏడాది అమలు కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలను అమలు చేయడంతో పాటు వారికి ఎదురవుతున్న సమస్యలను పరిష్కరిస్తే అన్నదాతలకు ప్రయోజనం చేకూరుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కాగా ఏడాది చివరల్లో ఖరీఫ్‌లో సాగు చేసిన సన్నవడ్లకు బోనస్ వేయడంతో రైతులకు కొంత మేర లబ్దిజరిగింది. అయితే కొనుగోళ్లు ఆసల్యంగా ప్రారంభించడం, బోనస్ వస్తదో రాదో అన్న ఆలోచనతో చాలా మంది రైతులు తమ సన్న వడ్లను వ్యాపారులకు, రైస్‌మిల్లులకే విక్రయించుకోవడంతో నష్టపోయారు.

ఉనికి కోసమే కాంగ్రెస్‌పై కవిత అబద్ధపు మాటలు

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

'ఉనికి కోసం కల్వకుంట్ల కవిత అబద్ధాలు మాట్లాడుతుంది. ఏ ప్రభుత్వ హయాంలో క్రైమ్ రేట్ పెరిగిందో ఏ ప్రభుత్వ హయాంలో క్రైమ్ రేట్ తగ్గిందో చర్చకు మేము సిద్ధంగా ఉన్నాం మీరు సిద్ధమైతే మాతో చర్చకు రావాలి. బీఆర్ ఎస్ హయంలో చేసిన పాపాలను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పాపాలను కడుగుతూనే ప్రజలకు అభివృద్ధి పనులను చేస్తుంది. కేవలం కాంగ్రెస్‌ను విమర్శించాలనే ఆలోచనతోనే కవిత నిజామాబాద్‌కు వచ్చిందని' కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏ రోజు కూడా ఎంపీగా ఎమ్మెల్సీగా ప్రజలకు అందుబాటులో కవిత లేదని, పోలీసులను తమ స్వార్థాల కోసం వినియోగించుకున్న వ్యక్తులు బీఆర్ఎస్ నాయకులు అని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అనేక హామీలు అమలు చేసినట్టు గుర్తుచేశారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవం వేడుకల



జెండా ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న నాయకులు, విద్యార్థులు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) 55 ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించి అనంతరం ఆవిర్భావ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముదాం అరుణ్ జెండాను ఆవిష్కరించి అనంతరం మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ గత 55 సంవత్సరాలుగా అధ్యయనం పోరాటం నినాదాలతో స్వాతంత్రం ప్రజాస్వామ్యం సోషలిజం లక్ష్యాలతో అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తుందని అన్నారు. విద్యార్థుల కోసం దేశవ్యాప్తంగా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాటాల నిర్వహించి అమరులయ్యారని వారి ఆశయ సాధన కోసం మనందరం పనిచేయాల్సిన అవసరం ఉంది అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాహుల్, నితిన్, సమీర్, సాయి, రాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధిని మరచిన కాంగ్రెస్

- నిజామాబాద్‌కు మంత్రి లేడు.. ఎంపీ ఉన్నా ఉపయోగం సున్నా
- ఎమ్మెల్సీ కవిత ధ్వజం

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

కాంగ్రెస్ పాలనలో నిజామాబాద్ జిల్లా అనాథగా మారిందని ఎమ్మెల్సీ కవిత ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా నుంచి కనీసం ఒక మంత్రి కూడా లేరని, ఎంపీ ఉన్నా లేనట్లే.. ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేలకు పవర్ లేదు. ఓడిపోయిన కాంగ్రెస్ నాయకులే అధికారిక కార్యక్రమాలకు హాజరవుతున్నారని వ్యాఖ్యానించారు. ఆరు నెలల నుంచి నిజామాబాద్‌కు పోలీసు కమిషనర్ లేకపోవడం దారుణమన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, జాతీయ నాయకుడని చెప్పుకునే షబ్బీర్ అలీ ఇక్కడి నుంచే ఉన్నా కనీసం కమిషనర్‌ను నియమించకపోవడాన్ని ప్రజల గమనించాలని అన్నారు. ఏడాదికాలంలో ఒక్క రూపాయి కూడా మున్సిపాలిటీలకు ఇవ్వలేదని, కాంగ్రెస్ ఏడాది పాలనలో ఒక కొత్త పని చేపట్టలేదని విమర్శించారు. ఎస్సారెస్పీ నుంచి నిజామాబాద్ రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్ల ఇవ్వలేదని, మేడిగడ్డ విషయంలో కేసీఆర్‌ను బద్నాం చేయాలన్న పిచ్చి ప్రయత్నంతో ఎస్సారెస్పీని ఎండబెట్టారని ధ్వజమెత్తారు. పెండింగ్ ప్రాజెక్టుల గురించి ప్రభుత్వాన్ని నిజామాబాద్ జిల్లా ఎమ్మెల్యేలు ఎందుకు ప్రశ్నించడం లేదని అడిగారు. షబ్బీర్ అలీకి నిజామాబాద్ పై ఆలోచన లేదు, పట్టిలేదని, నిజామాబాద్ జిల్లాలో ఇష్టానుసారంగా ఇసుక దందా జరుగు తోందని విమర్శించారు. ఇప్పుడు మైనింగ్ శాఖ ఆదాయం తగ్గింది.. కాంగ్రెస్ నాయకుల ఆదాయం పెరిగిందని తెలిపారు.

నిజామా బాద్, కామారెడ్డి జిల్లాల్లో కలిపి 3 లక్షల 79 మంది బీఆర్ఎస్ పార్టీ రుణమాఫీ చేసిందని, కానీ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ కేవలం 2 లక్షల మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేసిందని వెల్లడించారు. నిజామాబాద్ జిల్లాలో ఇంకా లక్షా 2 వేల మందికి, కామారెడ్డి జిల్లాలో 75 వేల మందికి రుణమాఫీ కాలేదని చెప్పారు. ఈ రైతులకు త్వరగా రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ యూనివర్సిటీకి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, తక్షణమే నిధులు విడుదల చేసి వర్సిటీ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణపై కమిటీలతో కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్ లో హైడ్రా పెట్టినట్టు నిజామాబాద్ లో నిడ్రా పెడుతామని పీసీసీ అధ్యక్షుడు చెప్పడం దారుణమని, బుల్డోజర్‌తో ప్రజల ఆస్తులు కూలగొడుతామని హెచ్చరిస్తున్నారని ప్రస్తావించారు. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని, కాబట్టి ప్రజల ఇళ్లపైకి బుల్డోజర్లను తీసుకెళ్తే మేము ఊరుకోబోమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ , మాజీ ఎమ్మెల్యే షకీల్ సలీమణి ఆయేష , జెడ్పీ చైర్మన్ విఠల్ రావు, నిజామాబాద్ మేయర్ నీతు కిరణ్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర హోంశాఖ మంత్రిని బర్తరఫ్ చేయాలి

- వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన
- అంబేద్కర్‌కు అమిత్ షా, మోడీ క్షమాపణ చెప్పాలని డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్/బోధన్



ధర్నా చౌక్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష నాయకులు

హెూం శాఖ మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని, మోడీ క్షమాపణ చెప్పాలని వాముపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్ వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వామపక్ష పార్టీల నాయకులు రమేష్ బాబు, వెంకట్ రాములు, వనమాల కృష్ణ, కంజర భూమయ్య మాట్లాడారు. దేశంలో లౌకిక ప్రజాస్వామ్య పరిరక్షణతో పాటు అన్నగారిన వర్గాలలో మనోస్థైర్యాన్ని నింపే పద్ధతుల్లో భారత రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పట్ల అమిత్ షా చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతర కరంగా ఉన్నాయని పైగా అమిత్ షా వ్యాఖ్యలను సమర్థించే పద్ధతుల్లో దేశ ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడటం ప్రజలకు మరింత దిగ్భ్రాంతికి గురి చేసాయని అన్నారు. దేశంలో ప్రజల మధ్య విద్వేషాలను పెంచి రాజకీయ ప్రయోజనాన్ని కాపాడుకోవడం కొరకు ఈ వ్యాఖ్యలు చేశారని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం బదులు బిజెపి తమ మనువాద సిద్ధాంతాన్ని అమలు జరపాలని చేసే కుట్రలో భాగంగానే ఈ వ్యాఖ్యలు ఉన్నాయని విమర్శించారు. వెంటనే ప్రధాని నరేంద్ర మోడీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పి హెూం శాఖ మంత్రి పదవి నుంచి అమిత్ షాను భర్త రఫ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనియెడల రాబోయే కాలంలో ప్రజలు నరేంద్ర మోడీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయ కులు ప్రభాకర్, ఈవీఎల్ నారాయణ, ఖాజా మొయినుద్దీన్, రాజేశ్వర్, లక్ష్మీ రామకృష్ణ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు రాములు, లక్ష్మి, అనసూయమ్మ, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు సుధాకర్, వెంకట్, సీపీఐ నాయకులు రాజారెడ్డి, లిబరేషన్ నాయకులు రాజన్న తదితరులు పాల్గొన్నారు.



బోధన్‌లో నినాదాలు చేస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

బోధన్‌లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో..

బోధన్ : కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా ను మంత్రివర్గం నుంచి తక్షణమే బర్తరఫ్ చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. రాజ్యాంగ నిర్మాత బాబాసాహేబ్ అంబేద్కర్ పై హెూం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు ఖండిస్తూ.. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ధర్నా, నిరసన చేపట్టారు. నరేంద్ర మోడీ కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా ను బర్తరఫ్ చేయని యెడల ప్రజా ఉద్యమాలు పెరుగుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నూర్జహాన్, శంకర్ గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు వై గంగాధర్, నన్నే సాబ్ నాయకులు పోశెట్టి, మల్లేష్, నరసయ్య గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇండ్లమధ్యలో కల్లుబట్టిని తొలగించాలి

- ప్రజల డిమాండ్.. ఎక్సైజ్ తీరుపై తీవ్ర ఆగ్రహం

నవతెలంగాణ-నవీపేట్



ఎక్సైజ్ అధికారులతో స్థానికుల వాగ్వాదం

ఇండ్ల మధ్యలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన కల్లుబట్టిని తొలగించా లని మండలంలోని నాగేపూర్ గ్రామ స్తులు డిమాండ్ చేశారు. జనావాసాల నడుమ కల్లుబట్టి ఉండటంతో మహిళలు ఇండ్ల నుంచి బయటకు వచ్చేందుకు ఇబ్బందికర పరిస్థితు ఏర్పడినట్టు తెలిపారు. కాగా కల్లు దుకాణాన్ని తొలగించాలని కాలనీవాసులు ఎక్సైజ్ అధికారులను ఆశ్రయించారు. దీంతో సోమవారం ఉదయం ఎక్సైజ్ సీఐ దిలీప్ తన సిబ్బందితో కలిసి కల్లు దుకాణాన్ని పరిశీలించి ఈ కల్లు దుకాణం ఎవరిది అని వివరాలు అడగగా ఆ కల్లు దుకాణం గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుడిది అని తెలిసి అడగడం ఏంటి అని స్థానికులు మండిపడ్డారు. ఎక్సైజ్ అధికారులు తూతు మంత్రంగా గ్రామంలో కొంతమంది లైసెన్సు దారులను ఈ దుకాణం ఎవరిది అని విచారించి ఎలాంటి చర్యలు తీసుకోకుండానే వెనుతిరిగారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ఎన్ని కల్లు డిపోలు ఉన్నవి, ఎన్ని కల్లు దుకాణాలు ఉన్నాయనే విషయం ఎక్సైజ్ అధికారులకు తెలియకపోతే ఎవరికి తెలుస్తుందని ప్రశ్నిం చారు. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు అక్రమ కల్లు డిపోలను, దుకాణాలను తొలగించాలని లేకుంటే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలి

లింగంపేట్ గ్రామస్తుల రాస్తారోకో

నవతెలంగాణ-లింగంపేట్



రాస్తారోకో చేపట్టి నినాదాలు చేస్తున్న గ్రామస్తులు

గ్రామపంచాయతీకి కేటాయించిన స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వాటిని వెంటనే రద్దుచేసి తిరిగి గ్రామ పంచాయతీకే కేటాయించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కుల సంఘాల పెద్దలు, గ్రామస్తులు, వ్యాపారులు, అన్ని వర్గాల ప్రజలు గంటపాటు రాస్తారోకో చేపట్టారు. గతంలో గ్రామ పంచాయతీకి నాలుగు ప్లాట్లు కేటాయించారని వాటిని గుట్టు చప్పుడు కాకుండా కేటాయించిన వ్యక్తులు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. ఈ సందర్భంగా పోచమ్మ ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు, మాజీ సర్పంచ్ పోతగోని శంకర్ గౌడ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ పరిధిలో భూమి యజమానులు సర్వే నబర్ 1074 లో 2.24 గుంటలు లేఅవుట్ చేసి గ్రామపంచాయతీ చిత్ర ప్రకారం లేఔట్ ప్లాట్ల విక్రయం చేసే సమయంలో యజమానులు గ్రామపంచాయతీకి 18,19,39,40 నాలుగు ప్లాట్లు కేటాయించినట్టు తెలిపారు. ప్రస్తుతం భూమి యజమానులు గ్రామపంచా యతీకి తెలవకుండా జీపీకి కేటాయిం చినటువంటి నాలుగు ప్లాట్లను ఒకరి పేరు మీద నుండి నలుగురు పేర్ల మీద వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేస్తున్నారన్నారు. కోటి రూపాయలు విలువచేసే పాట్లను వారి పేరు మీద ఎలా రిజిస్ట్రేషన్ చేసుకుంటారని ప్రశ్నించారు. గంటపాటు రాస్తారోకో చేపట్టడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి అనంతరం మండల పరిషత్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఎంపీడీవో నరేష్ ఎమ్మార్వో నరేందర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. దీంతో వారు గ్రామపంచాయతీ కేటాయించిన ప్లాట్ల వద్దకు వచ్చారు. వాటిని పరిశీలించారు. గ్రామపంచాయతీకి కేటాయించిన స్థలంలో గ్రామస్తుల కోసం యువకుల కోసం జిమ్ ఏర్పాటు చేస్తామని ఎంపీడీవో గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

కామారెడ్డి అదనపు ఎస్పీగా చైతన్య రెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి



చైతన్యరెడ్డి

కామారెడ్డి జిల్లా అదనపు ఎస్పీగా చైతన్యరెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2021వ బ్యాచ్‌కు చెందిన చైతన్య రెడ్డి.. వరంగల్ ఎన్ఐటీ నుంచి సివిల్ ఇంజినీర్ పట్టా పొంది.. రాష్ట్ర నీటిపారుదల శాఖలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా విధులు నిర్వర్తించారు. అటు విధులు నిర్వర్తిస్తూనే ఐపీఎస్‌కు ప్రిపేర్ అయి 161వ ర్యాంక్ సాధించారు. ట్రైనీ ఐపీఎస్‌గా ఇటీవల నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వోగా పని చేశారు.

నవతెలంగాణ
2
నిజామాబాద్
మంగళవారం | డిసెంబర్ 31, 2024 | www.navatelangana.com

రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో నియో లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ విద్యార్థి ప్రతిభ

- జిల్లాస్థాయిలో 11 మందికి గోల్డ్ మెడల్



నవతెలంగాణ-నందిపెట్

ఉమ్మడి జిల్లాస్థాయి జూడో అసోసియేషన్ పోటీల్లో నియో లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌కు చెందిన 11 మంది విద్యార్థులు గోల్డ్ మెడల్ సాధించారు. ఈనెల 29న జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఏడో తరగతి విద్యార్థి శ్రీనిధిరాజ్ బ్రాంజ్‌మెడల్ సాధించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అరుణ్ సార్, ప్రిన్సిపాల్ రవికిరణ్, వ్యాయామ ఉపాధ్యాయులు వికాస్, నవీన్ ఉపాధ్యాయులు మెడల్ సాధించిన విద్యార్థులను అభినందించారు.

మండల పద్మశాలి సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల పద్మశాలి సంఘం 2025 క్యాలెండర్‌ను మండల కేంద్రంలోని పద్మశాలి విజయ సంఘం ఫంక్షన్ హాల్లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం మండల అధ్యక్షులు చింత తిరుపతి మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల పద్మశాలి కుల బంధువులందరికీ క్యాలెండర్లను అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం మండల ఉపాధ్యక్షులు రాజుల కృష్ణ మురళి, కోశాధికారి పోతు ధరణి కుమార్, కమ్మర్‌పల్లి పద్మశాలి విజయ సంఘం అధ్యక్షులు పిల్లమరి సుధాకర్, ఉపాధ్యక్షులు చింత హనుమంత్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ చింతా హనుమంతు, క్యాషియర్ అడిచర్ల రాజ్ కుమార్, కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- ఆల్ పెన్షనర్ల డైరీ ఆవిష్కరణ



ఆల్ పెన్షనర్స్ డైరీని ఆవిష్కరించిన కలెక్టర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

పెన్షనర్లు నూతన సంవత్సరంలో కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆకాంక్షించారు. సోమవారం తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2025 నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఎంప్లాయిస్, పెన్షనర్ల హెల్త్ స్కీంను జిల్లాలో పటిష్టంగా అమలయ్యే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కే.రామ్మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి మదన్మోహన్, సహాధ్యక్షులు హమీదుద్దీన్, కోశాధికారి ఈవిఎల్ నారాయణ, నిజామాబాద్ డివిజన్ అధ్యక్షులు సిర్ప హనుమాన్లు, జిల్లా నాయకులు జార్జి, బట్టి గంగాధర్, రాధా కిషన్, ప్రసాద్, మధుసూదన్, చంద్రశేఖర్, బాలస్వామి జీవన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకల్లో ఆంక్షలు మీరితే చర్యలు

- ఎక్సైజ్ సిఐ స్టీవెన్ సన్



నవతెలంగాణ-ఆర్మూర్

నూతన సంవత్సర వేడుకల్లో యువత డ్రగ్స్, గంజాయి జోలికి వెళ్ళవద్దని పట్టణ ఎక్సైజ్ సీఐ స్టీవెన్ సన్ సోమవారం తెలిపారు. అనుమతి లేని ప్రదేశాలు, బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగినా, అనుమతులు లేకుండా హెూటల్‌లో, దాబాల్లో గాని మద్యంతో కూడిన వేడుకలు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటమన్నారు. ఫంక్షన్ హాల్స్, హెూటల్స్‌లో మద్యం వినియోగించుటకు ఎక్సైజ్ పర్మిషన్ జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ నుంచి కచ్చితంగా తీసుకోవాల్సిందేనని తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా జిల్లాలో (07) ప్రత్యేక ఎక్సైజ్ టీమ్స్ ఏర్పాటు చేయబడ్డాయని పేర్కొన్నారు. జిల్లా సరిహద్దులో పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. పట్టుబడితే తెలంగాణ ఎక్సైజ్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి కౌన్సెలింగ్

- 25 మందికి జరిమానా, ఇద్దరికి జైలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కేంద్రంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 26 మందికి నిజామాబాద్ ట్రాఫిక్ సిఐ ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం రెండో క్లాస్ మెజిస్ట్రేట్ ముందు 26 మందిని హాజరు పరిచారు. 25 మందికి రూ.3500 జరిమానా విధించగా బాన్సువాడకు చెందిన వల్లపు శ్రీనివాస్‌కు ఒకరోజు జైలు శిక్ష, నగరంలోని ప్రగతి నగర్‌కు చెందిన శంకర్‌కు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్టు ట్రాఫిక్ సిఐ ప్రసాద్ తెలిపారు.

రైతులు ప్రమాదాలబారిన పడకుండా చూడాలి

- ట్రాన్స్‌కో డీఈ రమేష్



పొలం బాటలో మాట్లాడుతున్న ట్రాన్స్‌కో డీఈ రమేష్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

రైతులు తమ పంట పొలాల వద్ద విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా చూడాలని ట్రాన్స్‌కో డీఈ రమేష్ సూచించారు. సోమవారం మండలంలోని పడకల్ గ్రామంలో పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. పొలాల మధ్య ఉన్న మోటర్లు స్టార్టర్లు పివిసి పైపులు ఉండేలా చూసుకోవాలని, ప్రతి విద్యుత్తు వస్తువు తప్పనిసరి ఎర్తింగ్ చేయాలని సూచించారు. లో ఓల్టేజీ సమస్య రాకుండా విద్యుత్ మోటార్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలని కోరారు. సమస్యలు ఉంటే సిబ్బందికి తెలపాలని కోరారు. ట్రాన్స్‌ఫార్మర్ ఫీజులను రైతులు మార్చవద్దని సూచించారు. విద్యుత్ టోల్‌ఫ్రీ 1912 నెంబర్‌కు ఫిర్యాదు చేసి సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఈ బాలేశంకుమార్, పడకల్ సబ్‌స్టేషన్ ఏఈ భాస్కర్, విద్యుత్ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు.

కార్పొరేషన్ దుకాణాల అద్దె బకాయిలను చెల్లించాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన దుకాణ సముదాయాల్లో అద్దెదారులు అద్దె బకాయిలను తక్షణమే చెల్లించాలని సంబంధిత మున్సిపల్ అధికారులు సోమవారం దుకాణ సముదాయాల అద్దెదారులను కలిసి విన్నవించారు. లేకుంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పెద్ద బజార్ ఏటీఎంలో చోరీకి యత్నం

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కేంద్రంలోని రెండవ పోలీస్ స్టేషన్ పరిధిలోగల పెద్ద బజార్‌లోగల ఏటీఎంలో సోమవారం వేకువ జామున దొంగ చోరీకి యత్నించాడు. ఏటీఎంను పూర్తిగా ధ్వంసం చేశాడు. ఉదయం 5 గంటల ప్రాంతంలో ఏటీఎంలో అలికిడి కావడంతో స్థానికుడు గమనించి అరవడంతో దొంగ తన బైక్‌ను అక్కడే వదిలి పారిపోయాడు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలోని సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు సోమవారం అందజేశారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆదేశంతో గ్రామానికి చెందిన సుమారు 15 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేసినట్టు వినోద్ తెలిపారు. కార్యక్రమంలో ఎక్స్ ఎంపీటీసీ కాట్‌పల్లి నర్సారెడ్డి, నిజామాబాద్ రూరల్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సొప్పరి వినోద్, మాజీ ఎంపీటీసీ గంగారెడ్డి, వసంత్‌రావు, గన్న లక్ష్మణ్, సైకిల్ టెక్స్ అక్బర్, మున్నపు, బూస శ్రీధర్, డిష్ రాజు, సాయిలు, మండల యూత్ ప్రెసిడెంట్ వెంకటేష్, నట్టా తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికులకు రూ.12 వేలు ఇవ్వాలి

- ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు అఖిలపక్ష గ్రామకమిటీలను ఏర్పాటు చేయాలి
- ప్రజావాణిలో పలు వినతులు

నవతెలంగాణ-కంఠేశ్వర్/నిజామాబాద్‌సిటీ

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ రైతు సంఘం నిజామాబాద్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో సోమవారం ఆరు గ్యారెంటీల అమలు కోసం, వ్యవసాయ కార్మికులకు 12 వేల రూపాయలు సంవత్సరానికి ఇస్తానన్న గ్యారెంటీని అమలు చేయాలని కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు మాట్లాడుతూ.. వ్యవసాయ కార్మికులకు 12వేలు సంవత్సరానికి ఇస్తానని. కానీ అనేక నిబంధనలు పెడుతున్నారని అన్నారు. మొన్న డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క మాట్లాడుతూ.. పట్టాపాస్ పుస్తకాలు ఉన్నవాళ్లకు, రైతుబంధు పడుతున్న వాళ్లకు లేదని చెప్పారని, ఈ పథకానికి కోట్లు 12 వేల కోట్లు మాత్రమే కేటాయించమని చెప్తున్నారంటే 24 వేల కోట్లల్లో ఆరువేల కోట్లు ఒకసారి ఇంకో 6000 కోట్లు రెండవసారి ఇస్తామని అన్నారని దీన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. కానీ నిబంధనలను వ్యతిరేకిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో 40 లక్షల మంది భూమిలేని నిరుపేదలు ఉన్నారని, ఇంకో పదిహేను శాతం మంది అర ఎకరం, ఎకరం, రెండు ఎకరాలు ఉన్న వాళ్ళు ఉన్నారని తెలిపారు. ఈ రెండు ఎకరాల్లోపు ఉన్నవాళ్ల వారం పది రోజుల వరకు మాత్రమే పని సరిపోతుందని, మిగతా 360 రోజులు ఖాళీగా భూస్వాముల దగ్గర, మధ్యతరగతి రైతుల దగ్గర కూలి చేసుకుంటూ జీవనం గడుపుతున్నారన్నారు. గ్రామసభలు ఏర్పాటు చేసి లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. వీరి హక్కుల కోసం పోరాడుతున్న సంఘాలతో కమిటీ వేసి ప్రభుత్వం సలహాలు తీసుకోవాలని కోరారు. ఏ ప్రభుత్వ పథకానికి నోచుకోని ఒంటరి మహిళలు కూడా ఉన్నారని, వాళ్ళని కూడా ఈ పథకంలోనే అవకాశం కల్పించి అమలు చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్ల, ఇంటి రుణాల ఎంపికలో అర్హులైన వ్యవసాయ కూలీలందరికీ వచ్చేలా చూడాలని, పింఛన్లు కూడా 4 వేల రూపాయలకు పెంచి ఇవ్వాలని సూచించారు. దీంతోపాటు పట్టణాలలో పనిచేస్తున్న వాళ్లకు పట్టణ ఉపాధి హామీ పథకాన్ని కూడా అమలు చేస్తూ 200 రోజుల పని దినాలు కల్పిస్తూ 600 రూపాయలు రోజు కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే పోరాటాలు తప్పవన్నారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొర్ర సత్యనారాయణ, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్, సభ్యులు సాయిలు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గోశం లక్ష్మి, సహాయకార్యదర్శి నాగుల గోవర్ధన్, సభ్యులు రాజేశ్వరి, కళ, బోన్ల లక్ష్మీ నర్సయ్య, చంద్రకాంత్, తదితరులు పాల్గొన్నారు



వినతిపత్రాన్ని అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

బార్దాన్ కార్మికులకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వండి

నిజామాబాద్ సిటీ : నగరంలోని శ్రద్ధానంద్ గంజ్, రైస్ మిల్‌లలో పనిచేస్తున్న గన్ని బ్యాగ్ రిపేర్ బార్దాన్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఐఎన్‌టియుసి ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎన్‌టియుసి జిల్లా కార్యదర్శి మల్యాల గోవర్ధన్ మాటా ్లడుతూ.. భార్దాన్ కార్మికులకు యాజమాన్యాలు కనీస కూలీ రేట్లు, పిఎఫ్, ఈఎస్ఐ ప్రమాద బీమా లాంటి కనీస సౌకర్యాలు అమలు చేయడం లేదని అన్నారు, అనేక దుకాణాల్లో బాల కార్మికులతో పనిచేయించుకోవడం వల్ల స్థానికంగా ఉన్న కార్మికులకు పని దొరకడం లేదని అన్నారు. బాలా కార్మికుల నిర్మూలనకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని, పనిచే యిస్తున్న యాజమాన్యాలపై చట్టరీత్యా చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మంజూరు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లను, నిజామాబాద్ నగరంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను బార్దార్ కార్మికులకు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో భార్దాన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు దండే రాము, కార్యదర్శి షేక్ ఇమామ్, నాయకులు గంగాధర్, అబ్దుల్, సురేష్, రాజు, విజయ్, తదితరులు పాల్గొన్నారు..

ఇందిరమ్మ ఇండ్లకు అఖిలపక్ష గ్రామకమిటీలు ఏర్పాటు చేయాలి



వినతిపత్రాన్ని అందజేస్తున్న సీపీఐ(ఎం)నాయకులు

కంఠేశ్వర్ : ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు అఖిలపక్ష గ్రామ కమిటీలను ఏర్పాటు చేయాలని సిపిఐ(ఎం) జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రమేష్ బాబు మాట్లాడుతూ.. సంక్రాంతి పండగ తర్వాత ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయటానికి రూ.5లక్షలు కేటాయిస్తామని ప్రకటించారని తెలిపారు. లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరగకుండా ఉండాలంటే అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు దక్కాలంటే గ్రామాలు, పట్టణ వార్డులో అఖిలపక్ష కమిటీలను ఏర్పాటు చేసి లబ్ధిదారులను ఎంపిక చేసినప్పుడే పేదలకు న్యాయం జరుగుతుందని అన్నారు. అందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కటారి రాములు, ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను పరిష్కరించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- ప్రజావాణికి 105 ఫిర్యాదులు



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 105 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్ అంకిత్, ట్రైనీ కలెక్టర్ సంకేత్ కుమార్, డీఆర్డీఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాసరావు, ఆర్డీఓ రాజేంద్రకుమార్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను సూచించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సెలవురోజుల్లోనూ విద్యాబోధనపై ఫిర్యాదు

నిజామాబాద్ సిటీ : తెలంగాణ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో శ్రీచైతన్య పాఠశాలపై సోమవారం ప్రజావాణి లో నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సంధర్భంగా నగర అధ్యక్షుడు అఖిల్ మాటడుతూ నిజామాబాద్ జిల్లాలోని శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యం ప్రభుత్వం నిర్దేశించిన రెండో శనివారం, ఆదివారం సహా ఇతర అన్ని సెలవు రోజులను విద్యార్థులకు అందించకుండా తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని అన్నారు. ఈ సమస్య డిఈఓ, ఎంఈఓలకు అనేక సార్లు తెలియజేసినా పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ నిబంధనలను పాటించని పక్షంలో పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని, శ్రీచైతన్య యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ప్రణయ్, సాయి, సుజిత్ పాల్గొన్నారు.

టైలర్స్ కాలనీలో సమస్యలు పరిష్కరించాలని ప్రజావాణిలో ఫిర్యాదు

నగరంలోని 10వ వార్డులోని టైలర్స్ కాలనీలో మురికి నీరు నిలువ ఉండడం వల్ల అక్కడ ఉంటున్న దాదాపు 50 కుటుంబాలు అనారోగ్యం పాలు అవుతూ ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉందని సోమవారం ఐద్వా ఆధ్వర్యంలో అసిస్టెంట్ కలెక్టర్‌కి వినతి పత్రాన్ని ప్రజావాణిలో అందించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత మాట్లాడుతూ.. ఈ సమస్యపై వార్డు కౌన్సిలర్లకు, మున్సిపల్ అధికారులకు, స్థానిక ఎమ్మెల్యేల దృష్టికి గతంలో చాలా సార్లు స్థానికులు తీసుకువెళ్లారని అన్నారు. మంచినీటి కొరత ఉందని తెలిపారు. కాబట్టి మున్సిపల్ అధికారులు టైలర్స్ కాలనీ పై ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యలనుంచి విముక్తి కలిగించాలని విజ్ఞప్తి చేశారు. లేదంటే ఐద్వా ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపై పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానికులు లత, రేఖ, సుగుణ, లక్ష్మి, కవిత, జ్యోతి, దేవి పాల్గొన్నారు.

నేడు బస్సుజాత ముగింపు సభ

- చలో హైదరాబాద్ జయప్రదం చేద్దాం
- సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ పిలుపు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నేడు బస్సుజాత ముగింపు సభ, చలో హైదరాబాద్ జయప్రదం చేద్దామని సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ పిలుపునిచ్చారు. 31న చలో హైదరాబాద్ బస్సు జాత ముగింపు సభపై సోమవారం డిఎంహెచ్ఓకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నూర్జహాన్ మాట్లాడుతూ.. ఆశా వర్కర్ల ఫిక్స్ వేతనం రూ.18వేలు అమలుకు, కాంగ్రెస్ సర్కారు ఇచ్చిన హామీకై, చలో హైదరాబాద్ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న లెప్రసీ, పల్స్ పోలియో, టీబి, కంటి వెలుగు డబ్బులు వెంటనే చెల్లించాలని అన్నారు. ఆశాలకు కనీస వేతనం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రూ.18వేల వెంటనే అమలు చేయాలని తెలిపారు. పిఎఫ్, ఈఎస్ఐ వంటి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని, అధికారుల వేధింపులను ఆపాలని డిమాండ్ చేశారు. 31న ఆశ వర్కర్లు చలో హైదరాబాద్ ఇందిరా పార్క్‌లో జరిగే ముగింపు సభను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సుకన్య, రేణుక, బాలమణి, రమ, సంగీత, రేవతి, సాహెరా, రాధా, రేణుక, పాల్గొన్నారు.



వినతి పత్రాన్ని అందజేస్తున్న సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్

మేయర్ భర్తను పరామర్శించిన ఎమ్మెల్సీ కవిత



మేయర్ భర్తను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కవిత

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్ భర్త దండు శేఖర్‌ను నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సోమవారం ఆయన నివాసంలో పరామర్శించారు. ఇటీవల ఆయనపై ఒకరు దాడి చేయగా గాయపడి ఆసుపత్రిలో చేరి ప్రాణాపాయం నుంచి బయటపడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కవిత మేయర్ ఇంటికి వెళ్లి దండు శేఖర్‌ను పరామర్శించారు. దాడి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

నీలకంఠేశ్వరాలయంలో ఎమ్మెల్సీ కవిత ప్రత్యేక పూజలు


నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నగరంలోని నీలకంఠేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం మార్గశిర మాసం అమావాస్య కావడంతో ఆమె శివుడికి ప్రత్యేక పూజ, అభిషేకం చేశారు. కవితకు ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కవిత మాట్లాడుతూ.. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు. కవిత వెంట బీఆర్ఎస్ పార్టీ మాజీ కార్పొరేటర్లు విశాలిని రెడ్డి, శ్రీవాణి, మాజీ జెడటిసి సభ్యురాలు సుమనారెడ్డి, భారత జాగృతి కార్యకర్తలు, నాయకులు ఉన్నారు.

మన్మోహన్ సింగ్ మరణాన్ని రాజకీయం చేస్తున్న కాంగ్రెస్

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం పట్ల సోమవారం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ సంతాపం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు... ప్రధానిగా పదేళ్ల సేవలు అందించిన మన్మోహన్ సింగ్‌ను ఒక రబ్బరు స్టాంపుగా వాడుకొని అడుగడుగునా అవమానించింది సోనియా, రాహుల్, మన్మోహన్ తెచ్చిన ఆర్డినేన్స్ ను చింపేసిన ఘనత రాహుల్‌కే దక్కుతుందని అన్నారు. మన్మోహన్ సింగ్ సేవలు గుర్తించిన బిజెపి కేంద్ర ప్రభుత్వం అధికారిక లాంచనాలతో అంత్యక్రియలను జరిపించి, ఢిల్లీలోనే స్మారక స్థూల్ నిర్మించేందుకు సిద్ధం అయిందన్నారు. తెలంగాణ బిడ్డగా ఈ దేశానికి ప్రధానిగా సేవలందించిన పీవి నర్సింహారావు చనిపోతే ఢిల్లీలో అంత్యక్రియలు నిర్వహించకుండ భౌతిక ఖాయాన్ని పార్టీ కార్యాలయంలో పెట్టనివ్వకుండ అవమానించిన పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. కేంద్రంలో అధికారంలోకి రాగానే తెలంగాణ బిడ్డ పీవికి భారత రత్న ఇచ్చి గౌరవించిన పార్టీ బిజెపి అన్నారు. ప్రధానిగా చేసిన తెలంగాణ బిడ్డ పీవీని పట్టించుకోలేదన్నారు. మన్మోహన్ సింగ్ మరణంపట్ల ప్రతేక అసెంబ్లీ పెట్టి సంతాప తీర్మానం పెట్టడంపై తెలంగాణ బిడ్డగా ముఖ్యమంత్రి రేవంత్ ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు.



యూత్‌కాంగ్రెస్ అధ్యక్షునికి సన్మానం



అవినాష్‌ను సన్మానించిన పోరాట సమితి రాష్ట్ర కో చైర్మన్

నవతెలంగాణ-భీంగల్‌రూరల్

భీంగల్ మండల కేంద్రంలోని మాల సంక్షేమ భవనంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కో చైర్మన్ అంగరి ప్రదీప్ ఆధ్వర్యంలో భీంగల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షునిగా నెగ్గిన బద్ది అవినాష్‌ను శాలువాతో సన్మానించి, బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటాన్ని బహుమానంగా అందజేశారు. కార్యక్రమంలో ఆర్మూర్ డివిజన్ మాల మహానాడు కమిటీ, భీంగల్ పరిసర 20 గ్రామాల్లోని మాల యువతతో పాటు గ్రామ మాల సంఘాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని ఆయాగ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల సర్వే కొనసాగుతుంది. సోమవారం అధికారులు నిర్వహించిన సర్వే కార్యక్రమంలో తహసీల్దార్ మాలతీ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మండలంలోని హొన్నాజీపేట్, కోటాలపల్లి, ఇందిరానగర్ తండాల్లో నిర్వహించిన సర్వేలో పాల్గొని సర్వేలో తప్పులు లేకుండా పూర్తి చెయ్యాలని సర్వే అధికారులకు సూచించారు. మండలంలోని అంగన్వాడీలను సందర్శించి అక్కడి పరిస్థితులను, పిల్ల హాజరు, వారికీ అందిస్తున్న పౌష్టిక ఆహార వివరాలు పరిశీలించారు. ప్రభుత్వం వారికి అందిస్తున్న సౌకర్యాలను అందించాలని ఆదేశించారు .

బ్యాంకుకు మునుపటి శోభ తీసుకురావాలి


క్యాలెండర్‌ను ఆవిష్కరించిన బ్యాంక్ అధ్యక్షులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రతీ ఉద్యోగి శాయ శక్తులా కృషి చేసి బ్యాంకుకి మునుపటి శోభ తీసుకురావాలని ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్ రెడ్డి ఆకాక్షించారు. సోమవారం ఎన్డిసిసిబీ కార్యాలయంలో నిజామాబాద్ జిల్లా సహకార బ్యాంకు నూతన సంవత్సర క్యాలెండర్ 2025, డైరీని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సహకార బ్యాంకు అధ్యక్షులు కుంట రమేష్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు నూతన సంవత్సరంలో జిల్లా రైతాంగం సుభిక్షంగా ఉండాలని, ప్రతీ ఉద్యోగి శాయ శక్తులా కృషి చేసి బ్యాంకుకు మునుపటి శోభ తీసుకురావాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు నల్ల చంద్ర శేఖర్ రెడ్డిగారు, రాష్ట్ర మార్క్ ఫెడ్ అధ్యక్షులు మార గంగారెడ్డి, బ్యాంకు పాలకవర్గ సభ్యులు, బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి నాగభూషణం వందే, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను సన్మానించిన చిత్రబృందం



నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణ సమీపంలోని కమ్మ సంఘంలో జరుగుతున్న సినిమా షూటింగ్‌ను సోమవారం తిలకించేందుకు వెళ్లిన బోధన్ కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ పి.సమ్మయ్యను, న్యాయవాది హనుమంతరావును బుల్లెట్ రెడ్డి చిత్ర బృందం వారిని శాలువాతో సన్మానించారు. సినీ హీరో ఆదినారాయణ బార్ అసోసియేషన్‌లో సభ్యులుగా ఉన్నారని అడిషనల్ పీపీ సమ్మయ్య తెలిపారు. ఆయన బుల్లెట్ రెడ్డి సినిమాలో హీరోగా నటిస్తున్న సందర్భంగా షూటింగ్ లొకేషన్‌ను సందర్శించినట్టు తెలిపారు. న్యాయవాదులు హీరో ఆదినారాయణకు శుభాకాంక్షలు తెలిపి చిత్రం ఘన విజయం సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు తర్ల శంకర్, బానోత్ రమేష్, ధర్మయ్య, రాఘవేందర్ ఉన్నారు.

ఆర్జీలను పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్
- కలెక్టరేట్‌లో ఫిర్యాదులు స్వీకరణ
- పలు మండలాల్లోనూ ప్రజావాణి

నవతెలంగాణ-విలేకరుల బృందం

కామారెడ్డి : ప్రజావాణిలో వచ్చిన ఆర్జీలను పరిశీలించి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణి ద్వారా సంబంధిత అధికారులు ప్రజల దరఖాస్తులను పరిశీలించి చర్యలు తీసుకుంటారని తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 78 దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిశీలించి పరిష్కరించడానికి ఆయా అధికారులకు పంపించనున్నట్టు వివరించారు. భూ సమస్యలు, సదరం సర్టిఫికెట్స్, వ్యక్తిగత సమస్యలు వంటి ఆర్జీలు వచ్చాయని తెలిపారు. ఈ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓ రంగనాథ్ రావు, జడ్పీ సీఈవో చందర్, పలుశాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ప్రజావాణిలో ఆర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

సమస్యలపై వెల్లువెత్తిన ఫిర్యాదులు

- బిచ్కుంద ప్రజావాణిలో పాల్గొన్న బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి



నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ ప్రజావాణిలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 58 దరఖాస్తులు రాగా అందులో ముఖ్యంగా రుణమాఫీ కానీ రైతులు తమకు రుణమాఫీ చేయాలని దరఖాస్తులు చేసుకున్నారు. వికలాంగులు తమకు సదరన్ సర్టిఫికెట్లు అందజేయాలని మండల కేంద్రంలో చేపడుతున్న రోడ్డు వెడల్పు, మురికి కాలువల నిర్మాణం ఆలస్యం అవుతుందని దుమ్ము ధూళితో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని స్థానిక ప్రజలు ఫిర్యాదు చేశారు. గత 15 రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని, వ్యవసాయ అధికారులు స్థానికంగా ఉండకుండా అందుబాటులో ఉండడం లేదని రైతులు ఫిర్యాదు చేశారు. జుక్కల్ మండలంలోని ఆయా గ్రామాల్లో పోడు భూముల పట్టాలు అందజేయాలని ఎస్టీ సామాజికవర్గ రైతులకు అందజేసిన పట్టా భూముల పహానీలు రావడం లేదని సమస్య పరిష్కరించాలని సీపీఐ(ఎం) నాయకులు రైతులతో కలిసి దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం సబ్ కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ.. జుక్కల్ నియోజకవర్గంలోని మండలాల గ్రామాల ప్రజలకు జిల్లా కేంద్రం దూరంగా ఉండడంతో ఇక్కడి ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి నెల ఒక రోజు ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రజలు ప్రజావాణిలో తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సురేష్, ఎంపీడీవో గోపాలకృష్ణ, ఆయా శాఖల సంబంధించిన అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

ప్రజావాణికి ఫిర్యాదులు నిల్

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి సోమవారం ఎలాంటి ఫిర్యాదు రాలేదని తహసీల్దార్ రహీముద్దీన్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి రెండు గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమానికి ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, విద్యాశాఖ అధికారి రామస్వామి, ఐసిడిఎస్, ఆరోగ్యశాఖ, మిషన్ భగీరథ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణికి నలుగురే అధికారులు

నవతెలంగాణ-జుక్కల్

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ హిమబిందు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మండలానికి చెందిన నలుగురు అధికారులు మాత్రమే హాజరు కావడంతో అవాక్కయ్యారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో శ్రీనివాస్, తహసిల్దార్ హిమబిందు, ఎంపీఓ రాము, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ నయూం హాజరయ్యారని మిగతా శాఖలకు సంబంధించిన అధికారులు ఏ ఒక్కరూ మండలస్థాయి అధికారులు డివిజన్ స్థాయి అధికారులు ప్రజావాణి కార్యక్రమానికి రాకపోవడంతో ప్రజావాణి కార్యక్రమం నిర్వాహణ చేస్తున్న తహసీల్దార్ అసహనం వ్యక్తం చేశారు. రాబోయే ప్రజావాణి కార్యక్రమంలో ఇలాగే అధికారులు రాకుండా పునరావృతమైతే శాఖపరమైన చర్యలు తప్పవని తెలిపారు. నేటి నివేదికలను జిల్లా కలెక్టర్‌కు పంపించనున్నట్టు ఆమె తెలిపారు.


మాట్లాడుతున్న తహసీల్దార్ హిమబిందు

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


మృతి చెందిన నర్సింలు

నవతెలంగాణ-భిక్కనూర్(రాజంపేట్)

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన రాజంపేట్ మండలంలోని ఆరేపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నర్సింలు (37) అప్పుల బాధతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకులు వచ్చి చూసేసరికి తలుపులు మూసి ఉండడంతో తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా ఫ్యానుకు వేలాడుతూ కనిపించడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

విద్యార్థుల ఉన్నతికి పాటుపడాలి

- సబ్ కలెక్టర్ వికాస్ మహతో


నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించిన సబ్ కలెక్టర్

నవతెలంగాణ-బోధన్

ఉపాధ్యాయులు విద్యార్థుల ఉన్నతాధికారుల పాటుపడాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. సోమవారం బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్టేట్ టీచర్స్ యూనియన్ బోధన్ మండల శాఖ క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని, సమాజంలో మనం ఏ స్థానంలో ఉన్నా.. దానికి కారణం ఉపాధ్యాయుడేనని అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల మనసులో చిరస్థాయిగా నిలిచేలా విద్యాబోధన చేయాలన్నారు. అలాంటి ఉపాధ్యాయులను విద్యార్థులు జీవితంలో మరిచిపోలేరని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థుల ఉన్నతికి కృషి చేయాలని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకొస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బాలచంద్రం, బోధన్ అర్బన్ అద్యక్షులు సలీం, ప్రధానకార్యదర్శి కిషోర్, సుధాకర్‌రెడ్డి, వహేద్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ టీచర్లు అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

- ఐసిడిఎస్ బోధన్ సిడిపిఓ జానకి


మాట్లాడుత్నున్న సిడిపిఓ జానకి

నవతెలంగాణ-ఎడపల్లి

అంగన్వాడీ టీచర్లు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని ఐసిడిఎస్ బోధన్ సిడిపిఓ జానకి తెలిపారు. మండలంలోని జానకంపేట గ్రామంలో గల సెంటర్ (2) అంగన్వాడి కేంద్రంలో నెలవారి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె అంగన్వాడీ ఉపాధ్యాయలకు సూచనలు, సలహాలను అందజేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా అవుతున్న సరుకులతో పాటు పౌష్టికాహారాన్ని అంగన్వాడి కేంద్రానికి వచ్చే చిన్నారి బాల బాలికలతో పాటు, గర్భిణీ బాలింత మహిళలకు తప్పకుండా అందజేయాలని ఆమె ఆదేశించారు. కేంద్రానికి వచ్చే చిన్నారి బాలబాలికలు హాజరు పట్టికల ప్రకారంగా పిల్లలకు పౌష్టికాహారాన్ని అందజేయాలని ఆమె సూచించారు. అలాగే చిన్నారి బాలబాలికలకు పూర్వ ప్రాథమిక విద్యా స్థాయితో పాటు ఆటపాట లేపుతూ క్రీడలను ఆడించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. చిన్నారి బాల బాలికలు అంగన్వాడీ కేంద్రంలోని క్రమశిక్షణ పొందితే భవిష్యత్తులో ఇతర పాఠశాలలకు వెళితే అక్కడ కూడా బాల బాలికలు క్రమశిక్షణగా ఉంటారని ఆమె గుర్తుచేశారు. అంగన్వాడీ ఉపాధ్యాయులు, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. అంగన్వాడీ ఉపాధ్యాయులు తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరైతే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. సమావేశంలో ఐసిడిఎస్ ఎడపల్లి మండల పర్యవేక్షకురాలు విజయరాణితో పాటు మండలంలోని ఆయా గ్రామాల అంగన్వాడి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములుకు మహాభిక్ష



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని సిద్దుల గుట్ట అయ్యప్ప స్వామి ఆలయంలో గత నెల నవంబర్ 16 నుంచి మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్ దేవి లావణ్య అయ్యప్ప శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన భిక్ష కార్యక్రమం సోమవారంతో ముగిసినట్టు ఆలయ ధర్మకర్త అయ్యప్ప శ్రీనివాస్ సోమవారం తెలిపారు. 45 రోజులుగా నిత్య అన్నదాన భిక్షకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

రేణుక జ్యువెలర్స్ వారి మహా భిక్ష..

పట్టణంలోని జిరాయితినగర్‌లో రేణుక జువెలర్స్ యజమాని సంతాన గణేష్ వారి స్వగృహంలో మహా పడిపూజ, భిక్ష నిర్వహించారు. పురోహితులు నాగేష్ శర్మ గురుస్వామి ఆధ్వర్యంలో జరిగిన పూజ కార్యక్రమంలో కౌన్సిలర్ గంగా మోహన్ చక్రు, చెరుకు పృథ్వీరాజ్, లయన్ నివేదన్, డీజే దయానంద్, చేపూరి శ్రీధర్, గురుస్వాములు, కన్నెస్వాములు, తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

నవతెలంగాణ-జుక్కల్


వంటశాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ హిమబిందు

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని తహసీల్దార్ హిమబిందు, ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలలో జుక్కల్ ఎంపీడీవో, రెవెన్యూ తహసిల్దార్ కలిసి హాస్టల్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, అదేవిధంగా కిచెన్ గదులు ఎటువంటి దుమ్ము, ధూళీ లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కూరగాయలను పరిశీలించి ఎప్పటికప్పుడు తాజాగా కొనుగోలు చేసిన కూరగాయలను కొనుగోలు చేసిన వాటినే విద్యార్థినిలకు తాజాగా వేడిగా ఆహారం మెనూ ప్రకారం తప్పక అందించాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే మెనూ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచిందని, అందువలన విద్యార్థినీలకు ఆహారం అందించేందుకు ఎటువంటి సంకోచం చెందకుండా పొరపాట్లు చేయకుండా నిబంధనలు పాటించి మెను ప్రకారం అందించాలని అన్నారు. లేకుంటే శాఖాపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. విద్యార్థినిలకు నాణ్యమైన ఆహారం అందించి మంచి పేరు తీసుకురావాలని, అదేవిధంగా మంచి విద్యాబోధన అందించి జిల్లాలోని ప్రథమస్థానం వచ్చేవిధంగా పాటుపడాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న దస్త్రాలను అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పరిశీలన అధికారులతో పాటు ఆర్ఐ రాంపటేల్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ ట్యాలెంట్ టెస్ట్ నిర్వహణ


సోషల్ ట్యాలెంట్ టెస్ట్‌లో గెలిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మండల స్థాయి సోషల్ ట్యాలెంట్ టెస్ట్ సోమవారం నిర్వహించనున్నట్టు మండల విద్యాధికారి తిరుపతిరెడ్డి తెలిపారు. మండల స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్‌లో తెలుగు మీడియం నుంచి మొదటి స్థానం వి.అంజన సౌమ్య (జడ్.పి.హెచ్.ఎస్-మల్లూరు), ద్వితీయ స్థానం బి, భానుప్రియ (జిహెచ్ఎస్-నిజాంసాగర్), తృతీయస్థానం బి.దీపక్ (జడ్పీహెచ్ఎస్- అచ్చంపేట్), ఇంగ్లీష్ మీడియం నుంచి మొదటి స్థానం ఎం.గజానంద్ (టీజీఎస్‌డబ్లుఆర్ఎస్-అచ్చంపేట్), ద్వితీయ స్థానం కె.హరిప్రియ (టిజిఎంఎస్-అచ్చంపేట్), తృతీయ స్థానం శివరాం (టిజిఎంఎస్-అచ్చంపేట్), పి.నితిష (కేజీబీవీ-నిజాంసాగర్) స్థానాలు సాధించినట్టు ఎంఈవో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మొహమ్మద్‌నగర్ మండల అధికారి అమర్ సింగ్, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రాంచందర్, ఉపాధ్యాయులు సమత, శైలజ గౌస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్, గంజాయి జోలికి వెళ్లొద్దు

- బిచ్కుంద ఎక్సైజ్, ప్రొహిబిషన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ



నవతెలంగాణ-బిచ్కుంద

నిజామాబాద్ జిల్లా (ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి, కామరెడ్డి జిల్లా ప్రోహిబిషన్, ఎక్సైజ్ అధికారి పి.బి. హన్మంతరావు సూచనలు ఆదేశాల మేరకు నూతన సంవత్సర వేడుకలలో భాగంగా యువత డ్రగ్స్, గంజాయి జోలికి వెళ్ళవద్దని అనుమతి లేని ప్రదేశాలో బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగినా అనుమతులు లేకుండా హెూటల్స్ దాబాల్లో మద్యంతో కూడిన వేడుకలు నిర్వహించిన కఠిన చర్యలు తీసుకుంటామని బిచ్కుంద ఎక్సైజ్, ప్రొహిబిషన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు. ఫంక్షన్ హాల్స్ యందు మద్యం వినియో గించుటకు ఈవెంట్ నిర్వాహణకు జిల్లా ప్రోహిబిషన్ ఎక్సైజ్ శాఖ నుంచి ఖచ్చితంగా అనుమతి తీసుకోవాలని సూచించారు. ఇతర రాష్ట్రాల మద్యాన్ని విక్రయించినా లేదా కలిగి ఉన్న చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నూతన సంవత్సరం సందర్భంగా ఎక్సైజ్ కామారెడ్డి జిల్లాలో 4 ప్రత్యేక టీమ్స్ ఏర్పాటు చేసిందని, పై కేసుల్లో పట్టు బడితే ఎక్సైజ్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వే వేగంగా చేపట్టాలి

- ఎంపీడీవో సయ్యద్ సాజీద్ అలీ

నవతెలంగాణ-తాడ్వాయి

ఇందిరమ్మ ఇండ్ల సర్వేను వేగంగా చేపట్టాలని ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ అన్నారు. సోమవారం మండలంలోని కృష్ణాజీవాడీ గ్రామంలో చేపడుతున్న సర్వేను పరిశీలించారు. ప్రభుత్వం ఇచ్చిన గడువులోగా పూర్తిచేయాలని పంచాయతీ కార్యదర్శి చంద్రకళను ఆదేశించారు. చిన్నపాటి పొరపాటు లేకుండా కుటుంబ యజమాని పూర్తి సమాచారం సేకరించి యాప్ ద్వారా నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరున్నారు.



నూతన సంవత్సర వేడుకలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

- ఎల్లారెడ్డి ఎక్సైజ్ సీఐ శాఖీర్ అహ్మద్

నవతెలంగాణ ఎల్లారెడ్డి (లింగంపేట్)

ఎల్లారెడ్డి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో నూతన సంవత్సర వేడుకలను, ఫంక్షన్ హాల్లో నిర్వహించేందు కోసం ముందస్తుగా ఎక్సైజ్ శాఖ నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎల్లారెడ్డి ఎక్సైజ్ సీఐ శాఖీర్ అహ్మద్ తెలిపారు. సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి.సోమిరెడ్డి, కామారెడ్డి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.హన్మంత్‌రావు ఆదేశాల మేరకు ఎల్లారెడ్డి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో నూతన సంవత్సర వేడుకలను ఫంక్షన్ హాల్లో నిర్వహించే ఈవెంట్స్ కోసం ఎక్సైజ్ శాఖ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని కోరారు. బహిరంగ ప్రదేశాల్లో అనుమతి లేకుండా మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. హెూటల్స్, దాబాల్లో సిట్టింగ్‌లకు అనుమతి లేదని, ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తీసుకువచ్చిన, తరలించిన మద్యాన్ని పట్టుకుని సీజ్ చేసి, తీసుకువచ్చిన వారిపై కేసు నమోదు చేయనున్నట్టు ఎక్సైజ్ సీఐ హెచ్చరించారు. గుట్టుచప్పుడు కాకుండా మద్యం సిట్టింగులు చేస్తే వెంటనే సమాచారం అందించాలని సూచించారు.

నూతన సంవత్సర వేడుకలు శాంతియుతంగా నిర్వహించాలి

- ప్రజల జీవితానికి భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు
- గాంధారి ఎస్ఐ ఆంజనేయులు

నవతెలంగాణ-గాంధారి



నూతన సంవత్సర వేడుకలు శాంతియుతంగా నిర్వహించాలని, ప్రజల జీవితానికి భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని గాంధారి ఎస్ఐ ఆంజనేయులు సూచించారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు, యువత డిసెంబర్ 31 వేడుకలను ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా జరుపుకోవాలని సూచించారు. డిసెంబర్ 31వ తేదీ సాయంత్రం నుంచి స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తామని, డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారిపై కేసు నమోదు చేసి బైండోవర్ చేయనున్నట్టు తెలిపారు. గాంధారి మండల ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. డిసెంబర్ 31 వేడుకలు నిర్వహించుకునే ప్రజలు ప్రమాదాలకు దూరంగా ఉంటూ పోలీసు వారి సూచనలు పాటించాలన్నారు. వేడుకలు నిర్వహించుకునే వారు ఇతరుల మనోభావాలు దెబ్బతినకుండా, ప్రమాదాలకు దూరంగా ఉంటూ నిర్వహించుకోవాలని అన్నారు. వైన్స్ షాప్స్, బార్స్, రెస్టారెంట్స్ ప్రభుత్వ అనుమతించిన సమయ పాలన మాత్రమే పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే అలాంటి వారిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామన్నారు. అదేవిదంగా వాహనం సీజ్ చేయడం, లైసెన్స్ రద్దు చేయడం, బైండోవర్ లాంటి చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. గంజాయి, డ్రగ్స్ ఇతర మాదకద్రవ్యాలు సేవించే వారిపై ఎప్పటికప్పుడు డ్రగ్స్ టెస్టింగ్ డిట్ల ద్వారా తనిఖీలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. సైలెన్సర్ సౌండ్, ట్రిబుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే కూడా చట్ట పరమైన చర్యలు తప్పవన్నారు. మఫ్టీ టీమ్స్, స్పెషల్ బ్రాంచ్ సిబ్బందితో సిట్టింగులు, ఆరుబయట మద్యం సేవించడం, గుంపులుగుంపులుగా తిరుగుతూ మహిళలను వేధింపులకు గురి చేస్తూ, ఇబ్బందులను పెట్టేవారిపై షీటీం బృందాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయనున్నట్టు తెలిపారు. ఆర్కెస్ట్రా, డిజేలు, మైకులు ఉపయోగించడం, బాణసంచా నిషేధం, నిబంధనలు అతిక్రమిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని అన్నారు.

నేడు ట్రాఫిక్ ఆంక్షలను తప్పనిసరిగా పాటించాలి

- ఏసీపీ శ్రీనివాస్

నవతెలంగాణ-బోధన్

నూతన సంవత్సర ఆరంభం సందర్భంగా డిసెంబర్ 31వ తేదీన బోధన్ డివిజన్‌లోని వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ ఆంక్షలలో భాగంగా నిబంధనలను పాటించాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా 31వ తేదీ మంగళవారం రాత్రి బోధన్ పట్టణంలో, డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించనున్నట్టు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, అపసవ్య దిశలో వాహనాలు నడపవద్దని సూచించారు. శాంతి భద్రతలకు భంగం కలిగించవద్దని సూచించారు. నూతన సంవత్సరం వేడుకలను ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని, వారికి ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

సీసీ కాలువను నిర్మించండి

నవతెలంగాణ-బాల్కొండ



వ్యవసాయ పంట పొలాలకు సీసీ కాలువను నిర్మించాలని గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఇరిగేషన్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలోని పెద్ద చెరువు కింద ఉన్న చిన్న తూము లీకేజీ అవుతుందని, పంట పొలాలకు వెళ్తున్న కాల్వలో గుర్రపుడెక్కలు, ముళ్ళపదలతో నీళ్ల వృధాగా పోతున్నాయని, దీని ద్వారా వ్యవసాయ పొలాలకు సరిగా నీరు అందడం లేదని అన్నారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి కాల్వలకు మరమ్మతులు చేసి సీసీ కాలువను నిర్మించాలని విడిసి సభ్యులు కోరారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు గుండ్రోతి నడిపి పోశెట్టి, గ్రామ సదర్ సల్ల నరసయ్య, తోపారం అశోక్, ఈదాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- రెండు తులాల బంగారు నగలు అపహరణ

నవతెలంగాణ-బాల్కొండ



మండల కేంద్రంలోని యాదవ సంఘం వద్ద ఉన్న ఓ ఇంట్లో ఆదివారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. పొగరు చిన్న మల్లేష్, ఆయన భార్య సవిత ఇంటికి తాళం వేసి వేరే గ్రామానికి వెళ్లారు. రాత్రి సమయంలో దొంగలు తాళం పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. ఇంట్లోని వస్తువులను, బీరువాను చిందరవందర చేశారు. పూజ గదిలో ఉంచిన రెండు తులాల బంగారు నగలు, 10వేల నగదును ఎత్తుకెళ్లారు. సంఘటన స్థలాన్ని బాల్కొండ ఎస్.ఐ బి.నరేష్ సందర్శించారు.బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులను చైతన్యవంతం చేయండి

- ప్రతి కళాశాలలో యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటుచేయాలి
- అదనపు కలెక్టర్ అంకిత్ కుమార్
- ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

జూనియర్ కళాశాల స్థాయిలోనే విద్యార్థిని, విద్యార్థులను చదువుతోపాటు, క్రమశిక్షణ, యాంటీ డ్రగ్స్‌పై చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత ఆయా కళాశాలలలో ప్రిన్సిపాళ్ల అధ్యాపకులపైనే ఉందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అంకిత్ కుమార్ అన్నారు. సోమవారం సాయంత్రం నిజామాబాద్ కలెక్టరేట్లోని సమావేశం మందిరంలో నిజామాబాద్ జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపూడి రవికుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని, ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు, అన్ని రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాళ్ల ఇంటర్ బోర్డు సూచించిన మార్గ నిర్దేశకాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థిపై చదువు మాత్రమే కాకుండా, వారి భవిష్యత్‌పై, సమాజాన్ని పట్టిపీడిస్తున్న డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉంచేందుకు చైతన్య పరచాలని అన్నారు. అలాగే విద్యార్థుల్లో మానసిక స్థైర్యాన్ని పెంపొందించేందుకుగాను ఎప్పటికప్పుడు వారిని చైతన్యవంతం చేస్తూ, జీవితంపై, భవిష్యత్తుపై అవగాహన కల్పించాలని అన్నారు. దీనికోసం ఇంటర్ బోర్డు సూచించిన మార్గదర్శకాలను పాటించాలన్నారు. మానసికంగా కృంగిపోకుండా, ఆత్మహత్య శరణ్యం అనేది విద్యార్థుల దరి చేరకుండా, ఎప్పటికప్పుడు వారికి మానసిక డాక్టర్ల ద్వారా సమావేశ ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే టెలీ మానస్‌పై విద్యార్థుల్లో అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లా యాంటీ డ్రగ్స్ కమిటీ చైర్మన్ డిఎస్‌పి సోమనాథ్ మాట్లాడుతూ ప్రతి కళాశాలలో మత్తు పదార్థాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించడంతోపాటు వారిని ఎప్పటికప్పుడు చైతన్యవంతం చేయాలని సూచించారు. జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమల పూడి రవికుమార్ మాట్లాడుతూ కళాశాల స్థాయిలో ఇంటర్ బోర్డు కమిషనర్ సూచించిన మేరకు అన్ని కళాశాలల్లో వెంటనే సిలబస్ పూర్తి చేసి రానున్న ప్రయోగ పరీక్షలకు, వార్షిక పరీక్షలకు సంసిద్ధం చేయాలని సూచించారు. ప్రతి కళాశాలలో సీసీ. కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి కళాశాలలో యాంటీ డ్రగ్స్ కమిటీలుఏర్పాటు చేసి విద్యార్థుల్లో క్రమశిక్షణను పెంపొందించాలని సూచించారు. విద్యార్థులలో మానసిక స్థైర్యాన్ని పెంపొందించేందుకు నెలకొల్పిన టెలిమానస్ 14416 నంబర్ విద్యార్థులకు తెలియజేయాలని అన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అంకిత్‌కుమార్



పాల్గొన్న ప్రిన్సిపాళ్లు

మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు ఆత్మహత్యల వైపు వారి దృష్టి మరలకుండా ఎప్పటికప్పుడు చైతన్యం చేయాలని అన్నారు. సైకాలజిస్ట్ డాక్టర్ రవితేజ మాట్లాడుతూ.. ప్రతి కళాశాల స్థాయిలో యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేసి విద్యార్థుల మానసిక స్థితిగతులను అంచనా వేసేందుకు ప్రిన్సిపాల్ లు, అధ్యాపకులు కృషి చేయాలని అన్నారు. విద్యార్థుల మానసిక పరిస్థితిని అంచనా వేసి వారికి మానసికంగా సిద్ధం చేయడానికి తాము అందుబాటులో ఉంటామని అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ళ, ప్రైవేటు, ఎయిడెడ్, అన్ని రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల పాల్గొన్నారు..

నాణ్యమైన విద్యను అందించండి

- జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ తెలిపారు. ఈ సోమవారం జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయంలో స్టేట్ టీచర్స్ యూనియన్ డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖాధికారి అశోక్ మాట్లాడారు. సమస్యల పరిష్కారంలో ఎస్‌టి యు ముందు ఉంటుందని తెలిపారు. ఉపాధ్యాయుల శ్రేయస్సు కోసం కృషి చేసిన సంఘం అని అన్నారు. ఉపాధ్యాయునిగా ఉన్నపుడు ఎస్‌టియు సభ్యున్ని అని గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల భవిష్యత్తుకోసం పాటుపడుతూ నాణ్యమైన విద్యను అందించే విధంగా కృషిచేయాలని అన్నారు. వచ్చే పదవ తరగతి ఫలితాల్లో జిల్లా ప్రథమ స్థానంలో ఉండేవిధంగా కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ధర్మేందర్,ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ (వాసు), జిల్లా ఆర్థిక కార్యదర్శి అఫ్జల్‌బేగ్, జిల్లా కార్యవర్గ సభ్యులు బాల చంద్రం, రమేష్ మహేశ్వర్, యాదగిరి, కాంతారావు, రత్నాకర్, రవీందర్ గౌడ్, మల్లయ్య, పవన్ కుమార్, గంగాకిషన్, ఆనంద్ ప్రకాష్, హరికృష్ణ, గిరిరాజ్, మక్బూల్ హుస్సేన్, సన ఉద్దీన్, సురేందర్, సాయిబాబా, శ్రావణ్, మండలాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

గుంతను బాగుచేయండి సారూ..

- తాగునీటి పైపుల లీకేజితో పడ్డ గుంత

నవతెలంగాణ-ధర్పల్లి



రోడ్డుమధ్యలో ఏర్పడ్డ గుంత

గ్రామంలోని నడిరోడ్డులో తాగునీటి పైపుల లీకేజితో చిన్నగా ఏర్పడిన గుంత గతనెలనుండి అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు . మండలంలోని చల్లగర్గ గ్రామంలోని ప్రధాన రహదారిపై తాగు నీటి బోరు నుండి గ్రామంలో నీరు సరఫరా అయ్యే ట్యాంక్‌కు వెళ్లే ప్రధాన పైపు లీకేజి ఏర్పడి నెల రోజులు గడుస్తోందని, అధికారులు అక్కడినుండి ప్రతిరోజు రాకపోకలు చేస్తున్నప్పటికీ పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పలు మార్లు ఇలాగేలీకేజి ఏర్పడగా సరి చేశారు.. మళ్లీ చెడి పోవడం, గత 20, 25 సంవత్సరాల క్రితం వేసిన పైపులు శిథిలావస్థకు చేరి ప్రతిసారి ఇలాగె ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు. గతంలో సర్పంచులకు పలు మార్లు చెప్పిన సమస్య పరిష్కారం కాలేదని, ఇప్పుడైనా ప్రత్యేక పాలనలో అధికారులైన పరిష్కారం చూపుతారా అంటే ఏదీలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు అంటున్నారు . అధికారులు వెంటనే సమస్య పరిష్కరించాలని అధికారులకు గ్రామస్థులు వేడుకుంటున్నారు .

నూతన సంవత్సర వేడుకలకు చట్ట వ్యతిరేక పనులు చేయవద్దు

- మోపాల్ ఎస్సై యాదగిరి గౌడ్

నవతెలంగాణ-మోపాల్



నూతన సంవత్సర వేడుకలను ఆనందంగా జరుపుకోవాలని, అనైతిక కార్యకలాపాలకు దూరంగా ఉండి మద్యం సేవించి విచ్చలవిడిగా వాహనాలు నడిపి ఇతరులకు ఇబ్బంది కలిగే విధంగా ఉండవద్దని మోపాల్ ఎస్సై యాదగిరి గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆయన కోరారు. అర్ధరాత్రి వరకు రోడ్లపై తిరగకూడదని, మోటార్ సైకిళ్లను శబ్దం చేస్తూ గల్లీలో రోడ్లపై తిప్పకూడదని పేర్కొన్నారు. ఎక్కడ కూడా డీజే సౌండ్‌కి అనుమతి లేదని, ఒకవేళ ఎవరైనా డీజే సౌండ్ పెడితే చట్టరీత్యా చర్యలు తీసుకోబడతాయని, ర్యాష్ డ్రైవింగ్ లాంటిది చేయకుండా అనవసరమైన కేసులు వేసుకొని తమ చదువును, భవిష్యత్తుని నాశనం చేసుకోవద్దని యువతకు విజ్ఞప్తి చేశారు. నూతన సంవత్సర వేడుకలు ఆనందాలతో చేసుకోవాలి. కానీ విషాదాలతో ప్రారంభం కావద్దని ఆయన తెలిపారు. అలాగే మండల ప్రజలందరికీ నూతన సంవత్సర వేడుకల శుభాకాంక్షలు తెలిపారు.

ట్రస్మా ఆధ్వర్యంలో ఆటలపోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని దాస్ నగర్ సమీపంలో గల శ్రీ చంద్ర స్కూల్‌లో ఆలూరు, మాక్లూర్ మండలాల ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులకు ట్రస్మా ఆద్వర్యంలో సోమవారం ఆటల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆలూరు మండల విద్యాశాఖ అధికారి నరేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలు పిల్లల వికాసానికి దోహదపడతాయని తెలిపారు. చదువుతో పాటు ఆటలు కూడా అవసరమని అన్నారు. అనంతరం ట్రస్మ జిల్లా అధ్యక్షులు నిద్యానంద్ మాట్లాడుతూ పిల్లల్లో క్రీడ స్ఫూర్తిని పెంపొందించడానికి మొట్ట మొదటి సారి ట్రస్మ ఆద్వర్యంలో ఆటల పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఓటమి కూడా విద్యార్థుల్లో పట్టుదలను పెంపొందిస్తాయన్నారు. ఓటమి గెలుపుకు పునాదని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి సత్య నారాయణ, ఎస్సై రాజశేఖర్, ట్రస్మ మండల అధ్యక్షులు గంగాధర్ గౌడ్, శ్రీచంద్ర స్కూల్ వైస్ చైర్మన్ పోల్కం శ్రీనివాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

64 ట్రిప్పుల ఇసుక వేలం

నవతెలంగాణ-మోర్తాడ్

మండల కేంద్రంలోని రహస్య ప్రాంతంలో నిలువ ఉంచిన ఇసుకను సీజ్ చేసిన మండల రెవెన్యూ అధికారులు.. సోమవారం వేలంపాట నిర్వహించారు. 64 ట్రిప్పుల ఇసుకను అధికారులు సీజ్‌చేసి వేలం వేశారు. 1లక్ష80వేలకు సతీష్ వేలంపాటలో అధిక రేటు పాడి ఇసుకను దక్కించుకున్నట్లు మండల తాసిల్దార్ సత్యనారాయణ తెలిపారు. అధిక ధర పలికిన సతీష్ కు ఇసుక తరలింపు చేపట్టే బాధ్యతలను అప్పజెప్పినట్లు తెలిపారు.

గొర్రెపాటి మాధవరావు మరణం సమాజానికి తీరనిలోటు

- బార్ అసోసియేషన్ నివాళి

నవతెలంగాణ-కంఠేశ్వర్/ఆర్మూర్

నిజామాబాద్ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది గొర్రెపాటి మాధవరావు నాలుగు దశాబ్దాలకు పైగా న్యాయవాదిగా కొనసాగి పౌరసమాజానికి చేసిన సేవలు మరువలేనివని ఆయన మరణం న్యాయవాద సమాజానికి తీరని లోటని బార్ అధ్యక్షుడు మల్లెపూల జగన్మోహన్ గౌడ్ అన్నారు. బార్ సమావేశపు హాల్‌లో నిర్వహించిన సంతాపసభలో ఆయన మాట్లాడారు. యువ న్యాయవాదులు మాధవరావు అధ్యయనశీలిని అలవర్చుకోవాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు మంథని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ సహచర న్యాయవాది, ఆత్మీయమిత్రుడిని కోల్పోవడం బాధాకరమని అన్నారు. సమావేశంలో బార్ ఉపాధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి వసంత్ రావు, కార్యదర్శి సురేశ్, కోశాధికారి దీపక్, న్యాయవాదులు కవిత రెడ్డి, జగదీశ్వర్ రావు, రాజారెడ్డి, భాస్కర్, పరుచూరి శ్రీధర్, రవీందర్, ఆశా నారాయణ తది తరులు మాధవ రావుతో ఉన్న స్మృతులను గుర్తు చేసుకున్నారు. అంతకు ముందు జిల్లా కోర్టు ఆవంఇణంలో న్యాయమూర్తులు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల ఆధ్వర్యంలో సమావేశమై గొర్రెపాటి మాధవరావు కు సంతాపం ప్రకటించింది. సమావేశంలో అదనపు జిల్లా జడ్జి శ్రీనివాసరావు, సీనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్ బాబు, జూనియర్ సివిల్ జడ్జిలు చైతన్య, హరికృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్మోహన్ గౌడ్, జిల్లా కోర్టు పిపి రాజేశ్వర్‌రెడ్డి, గవర్నమెంట్ లీడర్ ఆముదాల సుదర్శన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాజేందర్ రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.



కంఠేశ్వర్ : నివాళ్లు అర్పిస్తున్న న్యాయవాదులు

ఆర్మూర్ :సీనియర్ న్యాయవాది గొర్రె పాటి మాధవ రావు మృతికి సోమవారం ఆర్మూర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంతాపం తెలుపుతు రెండు నిముషాలు మౌనం పాటించారు. న్యాయవాదులు విధులకు హాజరుకాలేరు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు తెడ్డు నర్సయ్య మాట్లాడుతూ.. మానవ హక్కుల పరిరక్షణకు తన జీవితాన్ని అంకితం చేశారని అన్నారు. సీనియర్ న్యాయవాదులు మాట్లాడుతూ... మాధవ రావు మృతి న్యాయవాద వృత్తికి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు భూపతి రెడ్డి, సదానందం, గంగారెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, కృష్ణం రాజు, రమేష్, షిండే, సుకేష్, రాములు, అజిత్ గణేష్, కిరణ్, శ్రవణ్ పాల్గొన్నారు.



ఆర్మూర్: మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షులు

అగ్ని ప్రమాదంలో పెంకుటిల్లు దగ్ధం

- మూడు లక్షల పదివేలు నగదు దగ్ధం

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలో నడిమిగల్లిలో ఓ పెంకుటిల్లులో సోమవారం అగ్నిప్రమాదం సంభవించింది. మండల కేంద్రానికి చెందిన పల్లికొండ చిన్న నర్సయ్య లక్ష్మి దంపతుల పెంకుటిల్లులో మంటలు వ్యాపించి మూడు లక్షల పదివేల నగదు, ఇంట్లోని సామాగ్రి, బట్టలు పూర్తిగా దగ్ధమయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పారు. అప్పటికే మంటలు వ్యాప్తి చెంది నష్టం సంభవించింది. బాధితులు రోదిస్తూ తాము ఉదయం వ్యవసాయ పనుల నిమిత్తం బయటకు వెళ్లామని అన్నారు. ఈ ఘటనపై స్థానికులు సమాచారం ఇచ్చారని తెలిపారు. ఈ అగ్ని ప్రమాదం షార్ట్ సర్క్యూట్ ద్వారా జరిగి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. తాను అప్పు చెల్లించడానికి ఇతరుల వద్ద నుంచి మూడు లక్షల నగదు తీసుకొచ్చానని, నగదు మొత్తం కాలిపోయిందని, కట్టుబట్టలతో మిగిలియామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ ఘటనలో దాదాపు 5 లక్షల రూపాయల ఆస్తి నష్టం జరిగిందని అగ్ని మాపక శాఖ హెడ్ కానిస్టేబుల్ శేఖర్ పేర్కొన్నారు.



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

ఎన్నికలు ఉన్నాయని వలస పక్షులు వాలుతున్నాయి

- మున్సిపల్ ఫ్లోర్ లీడర్ స్రవంతి రెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఎన్నికలు వస్తున్నందునే వలస పక్షులు మళ్లీ వాలున్నాయని ఎమ్మెల్సీ కవితను ఉద్దేశించి నిజామాబాద్ ఫ్లోర్ లీడర్ స్రవంతి రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జనం కవితను ఎప్పుడో మరిచిపోయారని అన్నారు. గత పదేళ్లలో బీ(టీ)ఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యమని, కుటుంబ పాలన, ప్రజా ప్రతినిధుల ఇండ్లపై దాడులు, లిక్కర్ స్కాంలతో కాలం వెళ్లదీశారన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలకు హామీల అమలు మీద ఎలాంటి చిత్తశుద్ధి లేదని అన్నారు.'పీపుల్ ఫ్రెండ్లీ పోలీసింగ్' గురించి కవిత మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని, పోలీసు వ్యవస్థని నిర్వీర్యం చేసిందే... కేసీఆర్ సర్కార్ అని అన్నారు. మీరు అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ పోలీసింగ్... ఉండేదని, ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు లో కాంగ్రెస్ పోలీసింగ్ లా... పోలీసు వ్యవస్థ తయారైందన్నారు. కేసిఆర్ విధానాలను అమలు చేయమని కాంగ్రెస్ సర్కారుని కవిత కోరుతున్నారని, ప్రస్తుతం రేవంత్ సర్కార్ ప్రజల వాగ్దానాలను గాలికి వదిలేసి అదే ఫార్ములాను పాటిస్తున్నారని అన్నారు. భయపడే రక్తం కాదని కవిత అంటున్నారని, ఆమెది జలగల్లా పీల్చే రక్తమని వ్యాఖ్యలు చేశారు. కేసిఆర్ కి కేటీఆర్‌కి భయం లేకపోతే క్వాష్ పిటిషన్ ఎందుకు వేశారని ప్రశ్నించారు. నిజామాబాద్ పవర్ ఏందో చూపిస్తామని కవిత అంటున్నారని, 2019 పార్లమెంట్, 2020 కార్పొరేషన్ ఎన్నికల్లోనే నిజామాబాద్ పవర్ ఏందో ప్రజలు చూయించారన్నారు. బీఆర్ఎస్ నిజామాబాద్‌లో ఎప్పుడో ఖతం అయిపోయిందని, వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు సైతం దొరకరని ఎద్దేవా చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎగిరేది భారతీయ జనతా పార్టీ జెండానే అన్నారు. గత ఎన్నికల్లో మేయర్ స్థానాన్ని తృటిలో కోల్పోయామని , ఈసారి పూర్తి మెజారిటీతో మేయ స్థానాన్ని కైవసం చేసుకుంటామని స్రవంతి రెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో భారతీయ జనతా పార్టీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్రవంతిరెడ్డి

ఎమ్మెల్సీ కవితను కలిసిన బినోల గ్రామస్తులు

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని బినోల గ్రామస్థులు గ్రామంలో నిర్మిస్తున్న శ్రీ సింధూర వరసిద్ధి వినాయక గుడి పున:నిర్మాణానికి ఆర్థిక సహాయాన్ని అందించాలని కోరుతూ నిజామాబాద్ ఎమ్మెల్సీ కవితను సోమవారం మర్యదపూర్వకంగా ఆమె నివాసంలో కలిశారు. కవిత సానుకులంగా స్పందించి తనవంతు సహాయాన్ని అందిస్తానని హామి ఇచ్చారు. కార్యక్రమంలో బినోల సోసైటి చైర్మన్ మగ్గరి హన్మండ్లు, నరేష్, బ్రహ్మయ్య, కిట్టు, నరేష్, ప్రభు, గిరిష్ ఉన్నారు.

నిరంతరం పోరాటాల ఛాంపియన్ ఎస్ఎఫ్ఐ

- ఘనంగా ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



డిచ్‌పల్లి :మాట్లాడుతున్న విగ్నేష్

నవతెలంగాణ-కంఠేశ్వర్/డిచ్‌పల్లి

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నిజామాబాద్ జిల్లా కమిటీ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఎఫ్ఐ ఆఫీస్ వద్ద 55వ ఆవిర్భావ దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షురాలు దీపిక జెండా ఎగర వేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విగ్నేష్ హాజరై మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ 1970 సంవత్సరంలో పురుడుపోసుకొని విద్యార్థుల సమస్యలపై నిరంతరం ఛాంపియన్‌గా పోరాటాల నిర్వహిస్తున్న ఏకైక సంఘం అని కొనియాడారు. ఈ 55 సంవత్సర కాలంలో అనేక అడ్డంకులు ఎదురైనా విద్యార్థులనూ ఐక్యం చేసి పోరాటాలను ముందుకు తీసుకెళుతుందని అన్నారు. దేశంలోని ప్రఖ్యాత జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ లాంటి ఎన్నో యూనివర్సిటీల్లో ఎస్ఎఫ్ఐ విజయ ఢంకా మోగిస్తుందని తెలిపారు. దేశానికి ముప్పు లాంటి నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని పోరాడుతున్నామని అన్నారు. విద్యా రంగాన్ని నిర్వీర్యం చేసే కుట్రలను తిప్పి కొడుతున్నామని ఆయన తెలిపారు. స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం అనే మూడు లక్ష్యాలను సాధించేవరకు ఉద్యమిస్తామని అని అన్నారు. నవ సమాజ నిర్మాణమే ఎస్ఎఫ్ఐ లక్ష్యమని గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాస్త్రీయ విద్యా విధానంవైపు అడుగులు వేయాలని, విద్యారంగానికి బడ్జెట్లో అధిక నిధులు కేటాయించి విద్యారంగం అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. విద్యార్థినులకు కనీస మౌలిక సదుపాయాలపై పోరాటాలకు సన్నద్ధం అవుతామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు చక్రీ, రాజు, ఆజాద్, వినీత్, తదితర నాయకులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి:భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) తెలంగాణ యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో వర్సిటీ లో ఆర్ట్స్ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా తెలంగాణ యూనివర్సిటీ అధ్యక్షుడు జంగిలి శివ జెండాను ఎగర వేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విగ్నేష్ హాజరై మాట్లాడారు. నవ సమాజ నిర్మాణమే ఎస్ఎఫ్ఐ లక్ష్యమని గుర్తు చేశారు. రానున్న కాలంలో యూనివర్సిటీ సమస్యల పై పోరాటాలకు సన్నద్ధం అవుతాము అని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షురాలు దీపిక యూనివర్సిటీ నాయకులు పృథ్వీ,సంతోష్,శివ,పవన్ కళ్యాణ్, సాగర్, కిరణ్, శ్రీహరి, చరణ్, విజయ్, మహేష్, వినీత్, చక్రి, నాయకులు పాల్గొన్నారు.

పిఏసీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ



సంఘం క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న విండో చైర్మన్, సభ్యులు

నవతెలంగాణ-మోర్తాడ్

మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. స్థానిక విండో చైర్మన్ బద్దం అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో సహకార క్యాలెండర్ ను ఆవిష్కరిస్తూ సభ్యులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు భూత్పురం మైపాల్, బాల మల్లేష్, లక్ష్మణ్, భూమేశ్వర్, కార్యదర్శి కాశిరాం తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
మంగళవారం | డిసెంబర్ 31, 2024 | www.navatelangana.com

విద్యార్థికి అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

నవతెలంగాణ-రెంజల్

ఈనెల 25 నుంచి 28 వరకు చత్తీస్‌ఘడ్‌లో నిర్వహించిన జాతీయస్థాయి నెట్‌బాల్ క్రీడల్లో చక్కటి ప్రతిభను కనబరిచి తెలంగాణకు గుర్తింపు తీసుకువచ్చిన విద్యార్థి అజయ్ కుమార్‌ను ఉపాధ్యాయ బృందం అభినందించింది. ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ చదివే ఎస్‌జీఎఫ్ అండర్ 19 విభాగంలో రాష్ట్రస్థాయి నెట్‌బాల్ చక్కగా క్రీడల్లో పాల్గొన్న అజయ్ కుమార్‌ను జాతీయస్థాయికి పంపడం తమ పాఠశాలకు గర్వకారణమని ప్రిన్సిపాల్ ఫిరోజ్ హైదర్ పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించినప్పుడే ఆ పాఠశాలకు గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, పురుషోత్తం, గంగాధర్, ప్రవీణ్, శంకర్, సలావుద్దీన్, ప్రతాప్, రాజేందర్, స్వప్న రాధా, జబీరియా, ఇంతియాజ్, కృష్ణ, భానుచందర్, సౌమ్య శాంతి, గీత, కల్పన తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇంటింటి సర్వే

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇంటింటి సర్వేలో భాగంగా గ్రామపంచాయతీ సిబ్బంది సర్వేను సోమవారం నిర్వహించారు. ఈ సర్వేలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు తూర్పు రాజు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు గడ శంకర్, లైని రమేష్, దేమే శ్యామ్, పత్తి ఆంజనేయులు, పత్తి రమేష్, గ్రామపంచాయతీ సిబ్బంది మూర్తి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



సర్వేలో పాల్గొన్న నాయకులు

నేరాలు తగ్గేలా చూస్తాం

- కొత్త సంవత్సరం సంబురాల్లో విషాదం నింపుకోవద్దు
- వార్షిక క్రైమ్ వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ సింధు శర్మ



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సింధూశర్మ

నవతెలంగాణ-కామారెడ్డి

2023 సంవత్సరంలో కంటే 2024 సంవత్సరంలో నేరాలు, హత్యలు పెరిగాయని, రోడ్డు ప్రమాదాల్లో గాయ పడినవి తక్కువే అయినా మరణాలు ఎక్కువగానే జరిగినట్లు జిల్లా ఎస్పీ సింధు శర్మ తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో 2024 సంవత్సర రిపోర్టు వివరాలు వెల్లడించారు. '2023లో 5,578 నేరాల చోటుచేసుకోగా.. 2024లో 6006 నేరాలు జరిగాయని, ఇందులో 708 ఆస్తికి సంబం ధించిన నేరాలు, 38 హత్యలు, 35 కిడ్నాప్‌లు, 60 రేప్ కేసులు, 513 రోడ్డు ప్రమాద కేసులు, 1441 ఇతరాత్ర కేసులు, 561 స్పెషల్ లోకల్ చట్టాల కేసులు, 535 మిస్సింగ్ కేసులు ఉన్నాయన్నారు. 2023లో 28 హత్య కేసులు, 2024లో 37 హత్య కేసులు చోటుచేసుకున్నాయి. జరిగాయని తెలిపారు. ఈ సంవత్సరము జరిగిన 37 హత్యలలో 10 కుటుంబ తగాదాలు, 6 వివాహేతర సంబంధాలు, 4 ఆస్తి తగాదాలు, (2) భూతగాదాలు, (2) పాత కక్షలు, (1) ప్రేమ వ్యవహారం, (1) అకస్మాత్తు ఘటన వలన జరిగాయి. 35 హత్యకేసులలో నేరస్తులను గుర్తించి అరెస్ట్ చేశాం. అదేవిధముగా నేరస్తులకు తొందరలోనే శిక్షపడే విధంగా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. ఆస్తి సంబంధిత నేరాలలో 65 శాతం కేసులను చేధించి నేరస్తులను అరెస్ట్ చేసి 53 శాతం సొత్తు ఇప్పటికే స్వాధీనం చేసుకుని బాధితులకు అందించాం. నేరస్థులందరిపై తగిన ఆధారాలతో కోర్టులో చార్జ్‌షీట్ వేసి వారికి శిక్ష పడేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. మహిళా సంబంధిత నేరాలు 2023లో 361 కేసులు కాగా, 2024లో 517 కేసులు చోటుచేసుకున్నాయి. ఇందులో (12) హత్యలు, (2) వరకట్న మరణాలు, (61) రేప్ కేసులు, (3) గృహ హింస వలన ఆత్మహత్యలు, (304) గృహ హింస కేసులు జరిగాయి. 103 లైంగిక వేధింపులు, (25) కిడ్నాప్ కేసులు నమోదయ్యాయి. 2025 కొత్త ఏడాదిలో నేరాలు తగ్గే విధంగా, ప్రజలందరికీ పూర్తి భద్రతతో కూడిన సమాజాన్ని అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు



నిధుల కాపీని అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-భిక్కనూర్(రాజంపేట)

రాజంపేట్ పట్టణ కేంద్రంలోని బీసీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ సహకారంతో నిధులు మంజూరు చేశారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చంద్రం, కిసాన్ సెల్ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి తెలిపారు. గ్రామాల అభివృద్ధికి సహకరిస్తున్న ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీకి గ్రామస్తుల తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జమీల్, గ్రామ యూత్ అధ్యక్షులు ముస్తాక్ అలీ, బీసీ సెల్ అధ్యక్షులు సురేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలాజీ, స్వామి, భీమయ్య, బాలరాజు, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబీకులపై దాడి

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండల కేంద్రంలోని సర్కొండవర్ రమేష్ కుటుంబంపై అదే గ్రామానికి చెందిన వడ్ల తులసిదాస్ ఆదివారం రాత్రి దాడి చేయడంతో కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో రమేష్ కుటుంబం నూతనంగా గృహ నిర్మాణం చేసి మంచిగా పని చేసుకుంటూ బాగుపడుతున్నారని కక్ష పెంచుకున్న తులసీదాస్ ఆదివారం రాత్రి అందాజ 10 గంటల సమయంలో దాడికి పాల్పడినట్టు తెలిపారు. రమేష్‌పై దాడికి దిగడంతో అడ్డుకున్న భార్య అన్నపూర్ణకు, కూతురు అలివేణిపై కూడా దాడి చేశాడని తెలిపారు. తీవ్రంగా గాయపడ్డ కుటుంబీకులకు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం రమేష్‌ను బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై సమాచారం తెలుసుకున్న పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చి దాడి చేసిన తులసిదాస్‌పై కేసు నమోదు చేశారు.

జిల్లాస్థాయి ప్రతిభాపోటీలకు గాంధారి విద్యార్థులు

నవతెలంగాణ-గాంధారి

మండలంలో కేంద్రంలో తెలంగాణ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన గాంధారి మండల స్థాయి ప్రతిభ పోటీలలో ఇంగ్లీష్ మీడియంలో జడ్పీహెచ్ఎస్ పెట్‌సంగం విద్యార్థి గురుదేవ్ ప్రథమ స్థానంలో, కూచి సాయి చరణ్, సాయి నితీన్ ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించారు. తెలుగు మీడియం విభాగంలో చద్మల్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని బి.స్రవంతి, ఎ.రోజా బి.ప్రియాంక ద్వితీయ తృతీయ స్థానాలను సాధించారు. వీరు జిల్లా స్థాయి ప్రతిభ పోటీలకు ఎంపిక కావడం పట్ల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం, ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ అభినందనలు తెలిపారు.

ఆదర్శ పాఠశాల మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ప్రత్యేకాధికారులు

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రమైన రెంజల్ ఆదర్శ పాఠశాలలో సోమవారం ప్రత్యేక అధికారుల బృందం మధ్యాహ్న భోజన వంటకాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులను ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు తాజా కూరగాయలను వండి విద్యార్థులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు సునీత, శ్రీనివాస్, శ్యామ్, సతీష్, భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ జెడ్పీటిసిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-గాంధారి

మండల మాజీ జెడ్పీటిసి సభ్యుడు తానాజీరావు తల్లి రత్నాబాయి గత పది రోజుల క్రితం మృతి చెందింది. విషయం తెలుసుకున్న కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ సోమవారం మాజీ జెడ్పీటిసిని పరామర్శించారు. అనంతరం రత్నాబాయి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత

- ప్రజలు ఆరోగ్యంగా ఉండడమే లక్ష్యం
- గ్రామపంచాయతీ కార్యదర్శి రామిరెడ్డి

నవతెలంగాణ-ఎడపల్లి

గ్రామీణ పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతనిస్తూ ప్రజలు ఆరోగ్యంగా ఉండటమే తమ లక్ష్యమని జీపీ కార్యదర్శి రామిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మంగల్‌పాడ్ గ్రామంలోని ఎనిమిదవ వార్డులో మురికి కాలువలను కార్మికులతో శుభ్రం చేసి చెత్త, పిచ్చి మొక్కలను తొలగించారు. ఇప్పటివరకు తాగునీటి సమస్య రాలేదని తెలిపారు. అలాగే ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను సైతం పకడ్బందీగా నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఆయనతోపాటు బిల్ కలెక్టర్ పద్మావతి, సంబంధిత అధికారులున్నారు.

బాధితులకు నిత్యావసర సరుకులు అందజేత



నిత్యావసర సరుకులను అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని జానకంపేట్ గ్రామంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు కాలిపోవడంతో బాధిత కుటుంబానికి జానకంపేట్ సొసైటీ చైర్మన్ మిద్దె నరేందర్ సోమవారం సందర్శించారు. మేకపు లక్ష్మి నరసయ్య కుటుంబానికి తన వంతుగా 25 కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులను అందజేశారు. పూర్తిగా కాలిపోయి నిరాశ్రయులైన ఈ కుటుంబాలను బోధన్ నియోజకవర్గం ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి ప్రభుత్వం తరపున ఆదుకోవాలని ఆయన కోరారు.

పోతంగల్‌లో బస్టాండ్ నిర్మించాలి

- సీపీఐ(ఎం) డిమాండ్.. వినతి



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-బోధన్ టౌన్/పోతంగల్

పోతంగల్ మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ నూతన భవనం నిర్మించి, ప్రయాణికులకు మంచినీటి, విద్యుత్, టాయిలెట్స్, మరుగుదొడ్ల తదితర సౌకర్యాలు కల్పించాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో బోధన్ ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వర్ని సీపీఐ(ఎం) ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ మాట్లాడుతూ.. నూతన మండలంగా ఏర్పడిన పోతంగల్ మహారాష్ట్ర సరిహద్దులో ప్రాంతంలో ఉండడంతో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. బస్టాండ్ చుట్టూరా ఉన్న స్థలానికి హద్దులు ఏర్పాటు చేసి కాపాడాలన్నారు. కార్యక్రమంలో పోతంగల్ మండల కన్వీనర్ పట్నం రాములు, మోస్రా మండల కన్వీనర్ మేకల మల్లేష్, ఆవాజ్ వర్ని ఏరియా కన్వీనర్ మహమ్మద్ ఖాన్, కేవీపీఎస్ నాయకుడు పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం



ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

నవతెలంగాణ-జుక్కల్

మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ఆవిర్భావ సభను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.అజయ్ కుమార్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎస్ఎఫ్ఐ గత 55 సంవత్సరాలుగా అధ్యయనం, పోరాటం నినాదాలతో స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాలతో అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. విద్యార్థుల కోసం దేశవ్యాప్తంగా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాటాలు నిర్వహించి అమరులయ్యారని వారి ఆశయ సాధన కోసం మనందరం పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండలాధ్యక్షులు షైక్ ఫిర్దోస్, నాయకులు జూనెద్, అక్షయ్, జమీల్, తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-పొతంగల్

మండలంలోని కారేగావ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సబ్ కలెక్టర్ వికాస్ మహతో సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతో మమేకమై, వారికి విద్యాసంబంధమైన విషయాలు చర్చించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

- ఎస్ఐ వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-తాడ్వాయి

వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపొద్దని స్థానిక ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ఆయన స్టేషన్‌లో మాట్లాడుతూ.. నూతన సంవత్సర వేడుకలు ఉత్సాహంగా జరుపుకోవాలని, మద్యం సేవించి కేరింతలతో వీధుల గుండా తిరగవద్దని, తాము ప్రధాన వీధుల గుండా ప్రత్యేక పికెట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పోలీసుల నిఘా ఉంటుందని, గ్రామాల ప్రజలకు ఎలాంటి ఆటంకాలు కలిగించవద్దని ఎస్సై తెలిపారు.

రెంజల్ ఆదర్శ పాఠశాలలో ప్యానల్ తనిఖీ

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని రెంజల్ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు బోధించే విధానంపై జిల్లాలోని వివిధ మండలాల పరిధిలోనున్న ఆదర్శ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్యానల్ తనిఖీని సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా రెంజల్ ఆదర్శ పాఠశాలను నవీపేట్ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పర్ని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్, ఆర్మూర్ పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామ్, జక్రాన్‌పల్లి ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సునీత, రెంజల్ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఫెరోజ్, హైదర్‌లు పాఠశాలలోని విద్యా బోధన పద్ధతులు, పాఠశాలకు సంబంధించిన రికార్డులను వారు పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టిని సారించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని వారు సూచించారు. ప్రతి ఆదర్శ పాఠశాలలో ఫ్యానల్ తనిఖీ నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో ఎల్లారెడ్డి

- నిరంతరం శ్రమిస్తున్న ఎమ్మెల్యే మదన్మోహన్ రావు
- రైతుల సంక్షేమమే ఆయన ధ్యేయం
- కాంగ్రెస్ మండల స్పోక్స్ పర్సన్ కాగుల మోహన్ యాదవ్



నవతెలంగాణ-గాంధారి

ప్రజల పట్ల నిబద్ధత, నిరంతర శ్రమ, అభివృద్ధి పట్ల ధృఢ సంకల్పంతో ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావు నిరంతరం కృషి చేస్తున్నారని కాంగ్రెస్ మండల స్పోక్స్ పర్సన్ కాగుల మోహన్ యాదవ్ తెలిపారు. సోమవారం నవతెలంగాణతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. రైతుల సంక్షేమాన్ని కాంక్షించిన ఎమ్మెల్యే 22వ ప్యాకేజీ కింద మూడు రిజర్వాయర్ల నిర్మాణా నికి తోడ్పాటును అందిం చారు. ఈ ప్రాజెక్టు ద్వారా నలువైపులా సాగునీరు అందించడమే కాకుండా, ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని పంట భూమిగా తీర్చిదిద్దడమే ఆయన ప్రధాన లక్ష్యం. రైతును లక్షాధికారి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.' అని తెలిపారు.

సొంత అంబులెన్స్ సేవలు..

నియోజకవర్గ ప్రజల ఆరోగ్యానికి అత్యంత ప్రాముఖ్యతనిచ్చే ఎమ్మెల్యే మదన్ మోహన్ సొంత అంబులెన్స్ సేవలను అందుబాటులో ఉంచారని వివరించారు. ఈ సేవలతో అనేకమందికి అత్యవసర సమయాల్లో చికిత్స పొందే అవకాశాన్ని కల్పించారని తెలిపారు. ఇది ఆయనకు ప్రజల పట్ల ఉన్న నిబద్ధతకు అద్దం పడుతుందని పేర్కొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్, ఎల్‌ఓసిల అండ..

రాష్ట్రంలోనే అత్యధికంగా సీఎం రిలీఫ్ ఫండ్, ఎల్‌ఓసిలను పొందడంలో ఆయన అందించిన కృషి చెప్పుకోదగిందని తెలిపారు. తన నియోజకవర్గ ప్రజల అవసరాలకు సహాయపడటంలో మదన్ మోహన్ ఎల్లప్పుడూ ముందున్నారని వివరించారు. ఇది ఆయనకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టిందని అన్నారు.

ఘనంగా ఎల్లమవాస్య పండుగ



మద్నూర్ : అవల్‌గావ్ గ్రామ సమీపంలో..



జుక్కల్ మండలంలో..



పిట్లం : ధర్మారంలో..

నవతెలంగాణ-విలేకరుల బృందం

మద్నూర్ : డోంగ్లి మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఎల్లమవాస్య పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. దీనిని పల్లెల్లో ఎలా మాస సంక్రాంతి పండుగ అంటారని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రతి ఒక్కరూ సంక్రాంతి పండుగ జరుపుకుంటే ఇక్కడి పల్లెల్లో ఎల మాస సంక్రాంతి జరుపుకుంటారని అంటున్నారు. సంక్రాంతికి ముందు వచ్చే అమావాస్యను ఎలా మాస పండుగగా ఇక్కడి ప్రజలు ఘనంగా నిర్వహించడం విశేషం.

జుక్కల్ : మండలంలోని గ్రామాలలో రైతులు రబీ పంట చేనులో ఎల్లా అమావాస్య పండుగను ఘనంగా సోమవారం నిర్వహించారు. మొదటగా రాత్రంతా మేలుకుని నైవేద్యంగా పిండి వంటకాలను తయారుచేశారు. ఉదయం సూర్యోదయం కాకముందే కుటుంబ సభ్యులతో కలిసి పంట పొలాల్లోకి వెళ్లి పండుగ నిర్వహించారు.

పిట్లం : మండలంలోని ధర్మారం, కంబాపూర్, కారేగావ్, గోడమేగావ్, అల్లాపూర్, పారేడుపల్లి తదితర గ్రామాలలో ఎల్ల మమావాస్య పండగను ప్రజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ఆనవాయితీగా వస్తున్న ఎలమమావాస్య (శూన్యం) పండగను ప్రజలు, రైతులు తమ పంట పొలాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బంధుమిత్రులతో పిండి, తీపి వంటకాలతో వనభోజనాలు నిర్వహించారు.

సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలకు బీటీ రోడ్డు వేయాలి

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా కేంద్రంలోని గుండ్ల చెరువు దగ్గర ఉన్న సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలకు వెళ్లే దారిలో మట్టి రోడ్డు ఉందని దాన్ని బీటీ రోడ్డుగా మార్చాలని బహుజన్ సమాజ్ పార్టీ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు మాలోత్ హరిలాల్ నాయక్ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమకొండ కేంద్రంలోని గుండ్ల చెరువు దగ్గర ఉన్న సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలకు వెళ్లే మట్టి రోడ్డు వర్షం పడిన ప్రతిసారి బురదమయంగా మారుతుందని, పాఠశాలకు వచ్చే విద్యార్థులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు నడవడానికి అతి కష్టంగా ఉంటుందన్నారు. చెప్పులు చేతులో పట్టుకుని దిగబడే బురదలో నుంచి నడవాల్సి వస్తుందన్నారు. గురుకుల టీచర్లు, విద్యార్థులను పాఠశాలకు పంపేందుకు వచ్చే తల్లిదండ్రులు, అక్కడ వ్యవసాయం చేసే వ్యవసాయదారులు ఈ దారి నుంచి నడవాల్సి ఉంటుందని, ఈ దారి సరిగ్గా లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. మట్టి రోడ్డు దారి పొడవు 650 మీటర్లు దూరం ఉందని, హాస్టల్ పక్కనే దోమకొండ గ్రామానికి సంబంధించిన పల్లె ప్రగతి వనం ఉందన్నారు. సబ్‌స్టేషన్ నుంచి గురుకుల స్కూల్ ఒక కిలోమీటర్‌లో ఉంటుందని, ఈ దారికి గ్రామానికి సంబంధించిన స్ట్రీట్ లైట్లు కూడా లేవని తెలిపారు. గురుకులంలో చదువుకునే పిల్లలకు గేమ్స్, అనేక రకాలు క్యాంపులు పిల్లలకు వేరే ప్రాంతంలో ఉన్న గురుకుల పాఠశాలకు టీచర్లు తీసుకెళ్లి ప్రోగ్రామ్స్ అయిపోయిన తర్వాత మళ్లీ ఈ గురుకుల పాఠశాలకు తీసుకురావాల్సి వస్తుందన్నారు. కావున ఈ రోడ్డుపై బీటీ రోడ్డు వేయాలని వినతిపత్రంలో కోరారు.

గుంతల రోడ్డు..

మరమ్మతు చేయించని అధికారులు



గుంతలుగా మారిన రోడ్డు

నవతెలంగాణ-తాడ్వాయి

కామారెడ్డి ఎల్లారెడ్డి రోడ్డు నుంచి దేవాయిపల్లి మీదుగా బ్రాహ్మణపల్లి వరకు రోడ్డు చెడిపోయి గుంతలుగా ఏర్పడినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. గత సంవత్సరకాలం నుంచి రోడ్డు గుంతలుగా ఏర్పడటంతో పాఠశాలకు వెళ్లాలంటే సైతం ఇబ్బందిగా ఉందని, గతంలో వాహనదారులు జారిపడి ఆసుత్రుల పాలయ్యారని గ్రామస్తులు అంటున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు బ్రాహ్మణపల్లి వరకు సుమారు 7 కిలోమీటర్లు తారు రోడ్డుకు మరమ్మతులు చేపడితే వాహనదారులకు ఇబ్బందులు తప్పుతాయని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

అక్రమంగా తరలిస్తున్న మహారాష్ట్ర దేశీదారు పట్టివేత



నవతెలంగాణ-మద్నూర్

మహారాష్ట్రకు చెందిన దేశీదారు అక్రమంగా తరలించే వాటిని పట్టుకున్నట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు. సోమవారం బిచ్కుంద ఎక్సైజ్ శాఖ సిబ్బంది మెనూర్ నుంచి డొంగ్లి వెళ్లే రోడ్డులో వాహనాలను తనిఖీలు చేస్తుండగా.. మొగ గ్రామస్తుడు అయిన డీజిల్వార్ నాగేష్ తన ద్విచక్రవాహనంపై 48 దేశీదారు మద్యం సీసాలు (ఒక్కొక్కటి 180 ఎంఎల్) మూటలో కట్టుకొని వస్తుండగా పోలీసులకు పట్టుబడ్డాడు. దీంతో పోలీసులు మద్యం సీసాలను, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకొని, అతనిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ తనిఖీలో పాల్గొన్న ఎక్సైజ్ అధికారులు, ఎస్సై నాగేష్, కానిస్టేబుల్ పరశురామ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

టెస్టులు మేమే రాస్తాం.. ఏం చేస్తారు

- మేము రాయొద్దని చెప్పడానికి మీరెవరు
- డాక్టర్ అవతారం ఎత్తిన సిబ్బంది, రిసెప్షనిస్ట్, మేనేజ్మెంట్
- సిబ్బందికి వత్తాసు పలికిన ఆసుపత్రి యాజమాన్యం
- అడిగితే దౌర్జన్యం చేస్తారా
- స్వారీతో సరిపెట్టుకున్న వైనం
- డిఎంఅండ్ హెచ్ఓ, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామంటున్న బాధితులు



డాక్టర్‌ను నిలదీస్తున్న బాధిత కుటుంబీకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఆస్పత్రి సిబ్బంది డాక్టర్‌గా అవతారమెత్తి రోగిని పరీక్షించకుండానే టెస్టులు రాసిన ఘటన నిజామాబాద్ నగరంలోని ఖలీల్‌వాడిలోగల విజయ సూపర్ స్పెషాలిటీ ప్రైవేట్ ఆస్పత్రిలో చోటుచేసుకుంది. డాక్టర్ అందుబాటులో లేడని తెలుసుకున్న బాధితులు టెస్టులు ఎందుకు రాశారని అడగడంతో బయటకు గెంటి వేసే ప్రయత్నం చేశారని ఆరోపించారు. బాధితుడు రాకేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నాలేశ్వర్ గ్రామానికి చెందిన లక్ష్మీ తన తల్లి అని, వృద్ధురాలు న్యూరో సమస్యతో బాధపడుతుంది. సోమవారం నిజామాబాద్ నగరంలోని ఖలీల్వాడి ప్రాంతంలో గల విజయ ఆస్పత్రిలో చికిత్స కోసం తన కుమారుడితో వచ్చింది. ఆసుపత్రికి వచ్చిన రోగి పేరుని ఆసుపత్రి సిబ్బంది నమోదు చేసుకొని ఓపీ ఫీజుని తీసుకున్నారు. అంతేకాకుండా సదరు వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో ఆస్పత్రి సిబ్బంది రోగితో మాట్లాడి సమస్యను తెలుసుకొని టెస్టులను వెంటనే చేయించుకొని రావాలని రోగికి ఓపీ చీటీపై రాసి ఇచ్చారు.

రోగిని డాక్టర్ పరీక్షించకుండానే టెస్టులు రాయడం ఏంటని సదరు రోగి కుమారుడు ఆస్పత్రి సిబ్బందిని ప్రశ్నించారు. దీంతో ఆస్పత్రి సిబ్బంది దురుసుగా మాట్లాడడమే కాకుండా దౌర్జన్యం చేసినట్లు బాధితులు ఆరోపించారు. ఆస్పత్రి సిబ్బంది టెస్టులు రాసిచ్చిన చీటీని లాక్కోవడానికి ప్రయత్నించారన్నారు.

దీంతో న్యాయం చేయాలని ఆసుపత్రి ఎదుట బాధితులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బాధితులు రాకేష్ మాట్లాడుతూ.. ఆసుపత్రిలో వైద్యు డు అందుబాటులో లేకున్నా సిబ్బంది రోగిని పరీక్షించి టెస్టులు ఎలా రాస్తున్నారని మండిపడ్డారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యశాఖ అధికారి వెంటనే విచారణ చేపట్టి న్యాయం చేయాలని బాధితులు కోరారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఒక్క ఆసుపత్రి కాకుండా పేరుమోసిన కొన్ని ఆసుపత్రుల్లో డాక్టర్లు అందుబాటులో లేకున్నా ఇదేవిధంగా కొనసాగుతుందని ఆరోపణ వ్యక్తం చేశారు. నిజామాబాద్‌లోని అన్ని ఆసుపత్రులపై జిల్లా యంత్రాంగం తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

టెస్టులు మేమే రాస్తాం ఏం చేస్తారు..

టెస్టులు మేమే చేస్తాం ఏం చేస్తారంటూ ఆసుపత్రి రిసెప్షనిస్టు బాధితులతో గొడవకు దిగారు. డాక్టర్ చెప్తేనే రాస్తాం అయితే ఏం చేస్తారు.. అంటూ తనకి ఇష్టం వచ్చినట్లు మాట్లాడడంతో బాధితులు ఆమెపై మండిపడ్డారు. రాయొద్దు అని చెప్పడానికి మీరెవరు అంటూ ఎదురుదాడికి దిగారు. ఈతంగమంతా ఆసుపత్రి డాక్టర్ సురేష్ కుమార్ ముందు జరగగా తను తమ ఆసుపత్రి సిబ్బందికే వత్తాసు పలికారు. చివరకు అందులో పని చేస్తున్న వ్యక్తి శంకర్ మేనేజ్మెంట్‌గ వ్యవహరిస్తారని తాను చెప్పడంతోనే ఇదంతా రిసెప్షనిస్ట్, సిబ్బంది చేశారని బాధితులు తెలిపారు. డాక్టర్ రూమ్ లోనే ఇదంతా గొడవ జరగడం విడ్డూరంగా ఉంది. చివరకు డాక్టర్ అక్కడున్న వారిని సముదాయించి బాధితులకు స్వారీ చెప్పారు.. అనంతరం మీడియాతో డాక్టర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ.. కొన్ని సందర్భాలలో రిసెప్షనిస్టులు బ్లడ్ టెస్ట్‌లు రాస్తారు, ఆ తర్వాత డాక్టర్లు చూస్తారు.. ఇంకేమైనా టెస్టులు ఉంటే స్వయంగా డాక్టర్ రాస్తారు అని సమాధానం ఇచ్చుకొచ్చారు. బ్లడ్ టెస్ట్‌కు సంబంధించిన వాటిలో షుగర్ కు సంబంధించిన టెస్టుల్లో తినకముందు బ్లడ్ టెస్ట్ తిన్న తర్వాత బ్లడ్ టెస్ట్ లు ఉంటాయని అందులో భాగంగానే తినకమందు బ్లడ్ టెస్ట్ లు వారు తీసుకోవడంతో ఆ విధంగా అన్నారే తప్ప వేరే విధంగా అనలేదని తెలిపారు. ఎమ్మారై టెస్టును స్వయంగా డాక్టరే రాసి ఇచ్చానని చెబుతున్నారు కానీ బాధితులు మాత్రం డాక్టర్ రాసి ఇవ్వలేదన్నారు. అనంతరం డిఎంఅండ్ హెచ్‌వో రాజశ్రీకి ఫిర్యాదు చేశారు.



టెస్టుల కోసం రాసిచ్చిన ఓపీస్లిప్

నియోజకవర్గ ఇన్చార్జ్ పాలెపు రాజును అభినందించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



నవతెలంగాణ-ఆర్మూర్

బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజుకు సోమవారం జిల్లా కేంద్రంలో పలువురు అభినందించారు. సంస్థాగత ఎన్నికల్లో భాగంగా బీజేపీ జిల్లా కార్యాలయంలో పోలింగ్ బూత్ రివ్వు సమావేశం జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులచారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ రివ్యూ సమావేశానికి ముఖ్య అతిథులుగా బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా ఎన్నికల అధికారి కాసం వెంకటేశ్వర్లు , రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో ఆర్మూర్ నియోజకవర్గ బూత్ కమిటీలను, క్రియశిలా సభ్యత్వాలను నియోజకవర్గం ఇంచార్జ్ పాలేపు రాజు కాసం వెంకటేశ్వర్లుకు అందజేశారు. అనుకున్న సమయానికి బూత్ కమిటీలను, క్రియశీల సభ్యత్వాలను పూర్తి చేసి అందించి నందుకు పాలేపు రాజు కాసం వెంకటేశ్వర్లు అభినందించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు .

ఆరు బయట మద్యం సేవించిన వ్యక్తికి ఒకరోజు జైలు శిక్ష

నవతెలంగాణ-నవీపేట్

మండల కేంద్రంలోని దర్యాపూర్‌కు చెందిన షేక్ ఇలియాస్ ఆరుబయట మద్యం సేవించడంతో పోలీసులు సోమవారం స్పెషల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ బేగం వద్ద హాజరు పరచగా ఒకరోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై వినయ్ కుమార్ తెలిపారు. ఆరు బయట మద్యం సేవించడం చట్టరిత్యా నేరం కాబట్టి ఆరు బయట మద్యం సేవించవద్దని ఎస్ ఐ తెలిపారు.

జిల్లాస్థాయి కరాటేలో సత్తా చాటిన

లిల్లీపుట్ పాఠశాల విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని లిల్లీపుట్ పాఠశాలలోని విద్యార్థులు జిల్లా స్థాయి కరాటే పోటీలలో సత్తా చాటారు. జిల్లా స్థాయిలో ధ్రువ ప్రణయ్ గోల్డ్ మెడల్ అండ్ సిల్వర్ మెడల్ జిల్లా స్థాయిలో అందుకున్నారు. సోమవారం పాఠశాల కరస్పాండెంట్ రామకృష్ణ మాట్లాడుతూ.. తమ పాఠశాలలోని విద్యార్థులు కరాటేలో జిల్లా స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించడం చాలా సంతోషకంగా ఉందని వారిని అభినందించారు. తమ పాఠశాలలోనే కరాటే క్లాసులు జరుగుతాయని, ప్రతి విద్యార్థి ఎంతో ఆసక్తికరంగా నేర్చుకుంటున్నారని తెలిపారు. మన చేతిలో ఏ ఆయుధం లేనప్పుడు కరాటే ద్వారా శత్రువులను జయించవచ్చని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ దాసు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కరాటేలో గెలుపొందిన విద్యార్థులు

ఇందిరమ్మ ఇండ్ల సర్వే క్రాస్ వెరిఫికేషన్

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని పల్లికొండ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే చేసిన ఇండ్లలో ప్రతి గ్రామంలో క్రాస్ వెరిఫికేషన్ చేసినట్టు ఎంపీడీవో సంతోష్ కుమార్ సోమవారం తెలిపారు. ఏడు ప్రశ్నలకు తోడుగా అనుబంధ ప్రశ్నల ద్వారా వివరాలను ఎంట్రీ చేస్తున్నారన్నారు. ఇక ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పర్యవేక్షించేందుకుగాను నియమించిన అధికారులు స్కీమ్ అమలును పూర్తిస్థాయిలో పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. యాప్ లో నమోదు చేసే వివరాల ఆధారంగా.. దరఖాస్తుదారుడు అర్హులా? కాదా? అనేది వెల్లడవుతుందని తెలిపారు.

న్యాయ కళాశాల విభాగంలో శ్రీనివాస్, రతన్ సింగ్‌కు డాక్టరేట్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ న్యాయ కళాశాల విభాగం పరిశోధక విద్యార్థులు సభావాట్ శ్రీనివాస్, రతన్ సింగ్ లకు డాక్టరేట్ ను డాక్టర్ ప్రసన్న రాణి పర్యవేక్షణలో ఇద్దరిలో ఒకరు సభావాట్ శ్రీనివాస్ భారతదేశం యొక్క మహిళలకు నివాస స్థలం, హక్కుల గురించి అనే అంశంపై పరిశోధన జరిపారు.

సోమవారం జరిగిన బహిరంగ మౌఖిక పరీక్షకు ఎక్సటర్నల్ ఎగ్జామినల్ ప్రొఫెసర్ జీ.బి రెడ్డి.(ప్రొఫెసర్ రామ్ రెడ్డి ఎడ్యుకేషన్ స్టేట్ డైరెక్టర్) హాజరై పరిశోధన సిద్ధాంత గ్రంథం పై విస్తృతమైన, విపు లమైన సమగ్రమైన ప్రశ్నలు లేవనెత్తారు. ఎక్సటర్నల్ ఎగ్జామినర్ అడిగిన అన్ని ప్రశ్నలకు పరిశోధక విద్యార్థి సభావాట్ శ్రీనివాస్ సాపేక్షమైన ఉదాహరణలతో సమాధానాలు ఇవ్వడంతో ఎక్సటర్నల్ ఎగ్జామినర్ పరిశోధన గ్రంథం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. మరో పరిశోధక విద్యార్థి ఏం రతన్ సింగ్ డాక్టర్ ప్రసన్న రాణి పర్యవేక్షణలో తను అత్యవసరాల పరిస్థితిలో సినిమా నిర్మాణం, సినిమాల హక్కుల పై జరిగిన బహిరంగ మౌఖిక పరీక్షకు ఎక్సటర్నల్ ఎగ్జామినల్ ప్రొఫెసర్ జీ.బి రెడ్డి.(ప్రొఫెసర్ రామ్ రెడ్డి డాక్టషన్ ఎడ్యుకేషన్ స్టేట్ డైరెక్టర్) హాజరై పరిశోధన సిద్ధాంత గ్రంథం పై విస్తృతమైన, విపు లమైన సమగ్రమైన ప్రశ్నలు లేవనెత్తారు. సాపేక్షమైన ఉదాహరణలతో సమాధానాలు ఇవ్వడంతో ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్ పరిశోధన గ్రంథం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

పరిశోధక విద్యార్థి అందించిన జవాబులకు బహిరంగ మౌఖిక పరీక్షకు హాజరైన ప్రొఫెసర్ జీ.బి.రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. డాక్టర్ ఎం శ్రీనివాస్ డీన్ న్యాయ కళాశాల డాక్టర్ స్రవంతి,(బి ఓ ఎస్)న్యాయ కళాశాల డాక్టర్ జెట్లింగ్ ఎల్లోస పీహెచ్డీ డిగ్రీ ప్రధానానికి ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగజ్యోతి, న్యాయ కళాశాల సిబ్బంది, పరిశోధక విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.